ఆదివారం
ప్రజాశక్తి
సెప్టెంబరు 28, 2003





యువతను నిర్వీర్యం చేస్తున్న పాశ్చాత్య సంస్కృతి

హ్యాపీ బర్త్‌డే

(28-9-2003నుండి 4-10-2003వరకు)

జమీలా
సెప్టెంబర్
రహమ్మత్‌బీ- లాల్‌షా
వినాయకపురం- చిత్తూరు

పి. పుష్కల సాయి
సెప్టెంబర్
జ్యోతి-మస్తానయ్య
తాడిపర్తి-పొదలకూరు

రంగా సాయిదీపక్
1సం॥ సెప్టెంబర్-2002
అనూరాధ- జనార్ధనరావు
రావినూతల -ఖమ్మం

డి. కృష్ణసాయి
6సం॥, సెప్టెంబర్-1997
యశోద- లక్ష్మీపతి
చొప్పదండి- కరీంనగర్

ఎం. భాగ్యరేఖ
సెప్టెంబర్
సుందరమాణిక్యం- సత్యనారాయణ
మర్రిపాలెం- విశాఖపట్నం

ఎన్. కృష్ణసాయి కీర్తన్
1సం॥, 28. 9. 2002
కృష్ణవేణి- సుబ్బారావు
కొణిజర్ల- కృష్ణా

కె. సంతోష్‌రెడ్డి
సెప్టెంబర్
జ్యోతి-నాగిరెడ్డి
బొత్తలపాలెం- నల్లగొండ

కె. సునీల్
4సం॥, సెప్టెంబర్-1999
ఎలిశమ్మ- వీరయ్య
సర్వభారతినగర్- గుంటూరు

డి. సాహితి
6సం॥, 28.9. 1997
శ్రీలత- శ్రీరామచంద్రమూర్తి
ఉక్కునగరం- విశాఖ

శ్వేత
9సం॥, 28. 9. 1994
కల్పన- రమేష్
భట్టిప్రోలు- గుంటూరు

రమ్య
1సం॥, 29.9.2002
గౌరి- వాసుదేవరావు
శ్రీకాకుళం

ఎం. విశాఖ
2సం॥, 30. 9. 2001
శాంతిప్రియ- సాంబశివరావు
రామ్‌నగర్- హైదరాబాద్

కె. అఖిలాదేవి
5సం॥, 30-9-1998
లక్ష్మీరాజేశ్వరి- మురళీశ్రీనివాస్
ఇంద్రపాలెం-కాకినాడ

కె. శరత్
6॥సం,1-10-1997
సుధ- గడ్డెన్న
జవహర్‌నగర్- హైదరాబాద్

కె. శుష్మ
అక్టోబర్-2
చంద్రిక- కృష్ణ
మంగళగిరి- గుంటూరు

ఎస్. చంద్రలేఖ
2సం॥, 4. 10. 2001
ప్రమీల- శ్రీనివాస్

మనలో మాట

రాజీ'నామాలు'

వెనుకటికో మంత్రిగారు ఉండేవారు. తరచూ కుంభకోణాల ఆరోపణల్లో ఇరుక్కొనేవారు. వాటికి సమాధానాలు చెప్పాల్సి వస్తే అసలు విషయం వదిలేసేవారు. మంత్రి పదవి తనకు తృణప్రాయం అని దబాయించేవారు. తుచ్ఛ పదవి.. నా కాలిగోటితో సమానం అనేవారు. ఏక్షణంలో నయినా వదలుకోవడానికి తాను సిద్ధం అని ఘీంకరించేవారు. తన షేర్వానీ జేబులో రాజీనామా లేఖ సదా సిద్ధంగా ఉంటుందని సెలవిచ్చేవారు. విచిత్రమేమిటంటే ఎన్నడూ ఆయన దాన్ని జేబుల్లోంచి బయటకు తీయలేదు. పాపం షేర్వానీ జేబులో అది చీలికలు పీలికలై ఉండొచ్చు. నయాపూల్ మీదికి వెళ్లి పాత బట్టలు అమ్మే చోట వెతికితే అది దొరకొచ్చు కూడా.

ఇప్పుడు కాలం మారింది. కంప్యూటర్ యుగం. నేతలెవరూ రాజీనామా లేఖలను షర్టు జేబుల్లోనో, ఫ్యాంట్ జేబుల్లోనో పెట్టుకోవడం లేదు. ఏళ్ల తరబడి వాటిని గాలి వెలుతురు తగలకుండా బంధించడం లేదు. ఎప్పుడు పడితే అప్పుడు రాజీనామా లేఖలు ఇచ్చేస్తున్నారు. ఆ విషయం పత్రికల్లో ప్రకటిస్తున్నారు. సంచలనం సృష్టిస్తున్నారు. ఆ రాజీనామాలు ఏమవుతున్నాయో గాని వారి పదవులు మాత్రం పదిలంగానే ఉంటున్నాయి. రాజీనామా చేయొచ్చు. బోలెడు పబ్లిసిటీ కొట్టేయొచ్చు. పదవినీ వదలకుండా ఉంచుకోవచ్చు. అవ్వా బువ్వా రెండూ మనవే. అలాంటి టెక్నిక్ కనిపెట్టారు మన హైటెక్ నేతలు.

ఫలానా విషయంలో తమ వైఖరి నచ్చలేదంటూ ప్రతిపక్షాల వారు ముఖ్యమంత్రికి రాజీనామా లేఖలు పంపొచ్చు. పత్రికల వారిని పిలిచి ఆ విషయం ఆర్భాటంగా ప్రకటించొచ్చు. నాకు కాదు స్వామీ మీ లేఖలు స్పీకర్‌కు పంపించాలంటూ సిఎం వారు ఎలాగూ చెప్పలేరు. తానుగా ఆ లేఖను స్పీకర్‌కు పంపనూ లేరు. పంపారో ఉచ్చులో ఇరుక్కొన్నట్లే. తెలివైన ఎలుక బోనులోకి గ్యారంటీగా రాదు. అందుకని పదవికి వచ్చే ప్రమాదం ఏదీ లేదు. కనుక కాలుమీద కాళేసుకొని ఇలాంటి రాజీనామాలు ఎన్నయినా పంపుకోవచ్చు. ఈ ఎత్తులు ప్రతిపక్షాలకే చెల్లుతాయనుకోనక్కర్లేదు. అస్మదీయులూ అలాంటి విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు. ఎవరికి పంపుతున్నారు. అవి ఏమౌతున్నాయి అని మాత్రం అడక్కండి. ప్రభుత్వ నిర్ణయం మీద ఆత్మబంధువులూ ఉగ్రులైపోవచ్చు. రాజీనామాలు సమర్పించవచ్చు. అయితే ఒక్క జాగ్రత్త మాత్రం తీసుకోవాలి. మగవాళ్లయితే భార్యలకు, ఆడవాళ్లయితే భర్తలకు రాజీనామా లేఖలు అందచేయాలి. లేదంటే మాదాకబళం తల్లీ అంటూ గుమ్మం ముందుకొచ్చిన వాడిని పట్టుకోవాలి. చద్దీబొద్దీ లేదు గానీ ఇంద ఇది పట్టుకెళ్లు అంటూ రాజీనామా లేఖలను వాడి బొచ్చెలో వేసెయ్యాలి. ఈ జాగ్రత్తలు తీసుకొంటూనే పబ్లిసిటీకి పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలి. ఈ ప్రహసనానికి మరో పద్ధతికూడా ఉంది. సింహద్వారం గుండా వెళ్లి రాజీనామా విసిరేయొచ్చు. దొడ్డిదారి గుండా వెళ్ళి ఆమోదించవద్దంటూ కాళ్లూ వేళ్లూ. గడ్డం గట్రా పట్టుకోవచ్చు. కుర్చీ కోసం రాజీపడొచ్చు. ప్రజలకు నామం పెట్టొచ్చు. బహుశా అందుకేనేమో పెద్దలు ఈ తతంగానికి రాజీ'నామాలు' అన్న పదం ఖాయం చేశారు. అందుకే నేనంటాను... పెద్దల మాట పెరుగు మూట. మనలో మాట, మీరేమంటారు. ●

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం . . . 2
కవర్ స్టోరీ . . . 3
ఆరోగ్యం . . . 6
జీవనశైలి . . . 8
గేయలహరి . . . 9
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
కచేరి . . . 14
ఇంతిసంగతులు . . . 15
క్రీడారంగం . . . 17
పుస్తక పరిచయం . . . 20
రియల్ స్టోరీ . . . 22
పలుకుబడి . . . 24

ఇంకా...

దబ్బు విలువ తెలియజెప్పాలి

బాలవికాసం . . . 10



అవకాశాలున్నా అభివృద్ధి సున్నా

టూరిస్ట్‌గైడ్ . . . 16

ఎదురుగాలి

కథ . . . 18, 19

దృశ్యబద్ధం చేసిన 'అక్కినేని' నాటికలు

కళాసాహితి . . . 21

కార్టూన్ కదంబం


నేను నిర్దోషినని చరిత్రే.. రుజువు చేసింది!!
అయోధ్య వివాదం
అద్వానీ నిర్దోషి


మామా మహల్

స్టాంపుల కుంభకోణంలో మరికొంతమంది ఎమ్మెల్యేలు?


జాదు ఆనంద్
వీటన్నిటినీ మాయం చేయగలిగితే.. మీకు.. ఆస్థాన జాదూగర్ పోస్టిస్తా!!
* నకిలీ స్టాంపులు
* నకిలీ విత్తనాలు
* స్కాలర్‌షిప్‌ల కుంభకోణాలు
* నీటి సమస్య

* వల్లభనేని సురేష్

నగరాలు, పల్లెలూ అన్నీ నిద్రపోతుంటాయి. అపుడే నగరంలోను, శివార్లలోనూ మరో ప్రపంచానికి తెరలేస్తుంది. నక్షత్రాల్లా మెరిసే రంగు, రంగుల లైట్లు, ఆ కాంతిలో ఒళ్ళు తెలియకుండా డాన్సులు చేసే యువతీ యువకులు, ఈ దృశ్యానికి మరో కోణం టేబుళ్ళపై పడి ఒళ్ళు తెలియకుండా మద్యం సేవించే బడాబాబులు. వారికి కైపెక్కించే విధంగా అర్ధనగ్న నృత్యాలు చేసే నాట్యగత్తెలు. మహానగరాల్లో డబ్బును 'తేలిగ్గా' సంపాదించగలిగే 'తెలివైన' వారి బిడ్డలు. డబ్బు ఎలా ఖర్చు పెట్టాలో తెలియక, నోట్ల కట్టలతో డిస్కోథెక్కులకు వచ్చి సాగించే వికృత చేష్టలు హైదరాబాద్, దాని శివార్లలో రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో వేగంగా విస్తరిస్తున్న పాశ్చాత్య సంస్కృతి యువతను పీల్చి పిప్పి చేస్తోంది. చదువుండీ, అందముండీ ఉపాధి లేక ఉదర పోషణార్థం గతిలేక బార్లలో డాన్సులు చేసే పరాయి రాష్ట్రాల యువతుల జీవితాలు ఇక్కడే తెల్లారుతున్నాయి.

డబ్బు మదంతో దేన్నైనా కొనవచ్చనే సంస్కృతి, ఏ పని చేసినా డబ్బు సంపాదించడమే ముఖ్యమని ముఖ్యమంత్రి చేసే బోధనలతో నగరాలలో మాయగాళ్ళు పెరిగిపోతున్నారు. పర్యాటకాభివృద్ధి పేరుతో సాగిస్తున్న ప్రచారం నీచపు పనులతో డబ్బు సంపాదించాలని భావించే వారికి వర ప్రదాయని అయింది. డబ్బు మదం, మద్యం మత్తు, అధికార లాలస, వాటన్నింటితో సంక్రమించే తెంపరితనం యువత బాధ్యతలను తెలుసుకోలేక నిర్వీర్యమవుతోంది. రంగురంగుల లైట్ల వెలుగుల్లో ఎన్ని జీవితాలు నాశనమవుతున్నాయో, డిస్కోథెక్కుల మాయాజాలంతో ఎంతమంది యువతీ, యువకులు నైతికంగా పతనం అవుతున్నారో ఈ హైటెక్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పర్యాటకాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయంటూ ప్రచారం చేస్తున్న హైటెక్ ముఖ్యమంత్రి తన పాలనలో యువత మేధో సంపత్తిని ఏ విధంగా నాశనం చేస్తున్నారో ఎప్పటికి తెలుసుకుంటారు? ఎలా తెలుసుకుంటారు ? ఎవరు తెలుసుకుంటారు?



యువతను నిర్వీర్యం చేస్తున్న పాశ్చాత్య సంస్కృతి

మిణుకు మిణుకు మంటూ వింత కాంతులు వెదజల్లే విద్యుత్ దీపాల మధ్య హుషారెత్తించే సంగీత వాయిద్యాల హోరులో యువతుల అర్ధనగ్న ప్రదర్శనలు, మద్యం మత్తులో మునిగే మందుబాబుల కేరింతలు ఇదోపక్క. బతకాలి కనుక అంగాంగ ప్రదర్శన చేసి ఆకలి తీర్చుకునే యువతుల జీవితాలు మరోపక్క. బయట మెరిసే జీవితం వారికి నరక కూపం. వారికి పేదరికం ఇచ్చిన శాపం. బార్ అండ్ రెస్టారెంట్లలో డాన్సులు చేస్తూ అక్కడకు వచ్చేవారికి వినోదాన్నిపంచే యువతుల జీవితాలు కడు దయనీయంగా వుంటాయి. వీరికున్న అందం, నృత్య నైపుణ్యంతో బార్ యాజమానులు రోజుకు వేలాది రూపాయలు దండుకుంటున్నా చివరకు వీరికి ఇచ్చేది మాత్రం వందల్లోనే. వివరాల్లోకి వెళితే పాశ్యాత్య సంస్కృతి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో సుమారు 150 దాకా బార్ అండ్ రెస్టారెంట్లు వున్నాయి. వీటిలో ముప్పై మూడు బార్ అండ్ రెస్టారెంట్ల యాజమాన్యాలు ఎటువంటి అసభ్యకర నృత్యాలు చేయకుండా వినియోగదారుల కోసం పాట కచేరీలు నిర్వహించుకోవటానికి ప్రభుత్వం నుండి అనుమతి తీసుకున్నాయి. అయితే నూతనంగా పోలీస్ కమీషనర్ బాధ్యతలు స్వీకరించిన ఎం.వి కృష్ణారావు వాటికి ఇచ్చిన లైసెన్సులను 2002 డిసెంబర్ 30 వతేదీన రద్దు చేశారు. కొంత కాలం క్లబ్బుల్లో డాన్సులకు

బ్రేక్‌పడింది. వీటిపై లక్షలాది రూపాయలు సంపాదించే యజమానులకు ఈ చర్య తీవ్ర ఆగ్రహం తెప్పించింది. దీంతో వారు హైకోర్టులో కేసు దాఖలు చేశారు. వారికి 2003 ఫిబ్రవరి 6వతేదీ నుండి క్లబ్బుల్లో డాన్సులు, ఆర్కెస్ట్రా నడుపుకునేందుకు కోర్టు పర్మిషన్ ఇచ్చింది. దీంతో వారి ఆగడాలకు అంతే లేకుండా పోయింది.

పర్మిషన్ ఇచ్చిన దగ్గరనుండి పెద్దపెద్ద ఇంటర్నేషనల్ హోటల్‌నుండి చిన్న చిన్న బార్ అండ్ రెస్టారెంట్‌ల వరకు ఇక నృత్యాల హోరే. చిన్న చిన్న బార్ అండ్ రెస్టారెంట్లలో రాత్రి ఏడు ఎనిమిది గంటల నుండి ప్రారంభమయ్యే ఆర్కెస్ట్రా నెమ్మదిగా అర్ధరాత్రికి రూపురేఖలు మారిపోయి సింగర్లు తప్పుకుని డాన్సర్లు రంగ ప్రవేశం చేస్తారు. ఇక అక్కడ నుండి మందు బాబుల ఆగడాలకు అంతే లేకుండా వుంటుంది. నగరంలోని బార్లు రెస్టారెంట్లలోనే కాకుండా నగర శివారు ప్రాంతాల్లో కూడా ఇది మరీ విచ్చలవిడిగా వుంటుంది. ఇక్కడకు ఎక్కువగా వచ్చేది కాలేజీ స్టూడెంట్సే. బార్‌లో రంగంలోకి దిగగానే వారు మందు తాగుతూ ఈ ప్రపంచాన్నే మర్చిపోతారు. ఇక అక్కడ మోగే సంగీత ఝురికి మైమరచి మత్తెక్కి తమ ఉనికినే మర్చిపోతారు.

డిస్కోథెక్‌ల చరిత్ర

ఇవి ఒక ఎత్తైతే నగరంలో వున్న డిస్కోథెక్‌లది మరో చరిత్ర. ఇక్కడకు వచ్చేవారు ఎక్కువగా ఉన్నత వర్గాలకు చెందిన వారే. డిస్కోథెక్‌లోకి ప్రవేశించాలంటే కొన్ని నిబంధనల ప్రకారం వెళ్ళాలి. ఒక అమ్మాయి, అబ్బాయి కలిసి వెళితేనే వాటిల్లోకి అనుమతి వుంటుంది. ఒంటరిగా వెళ్ళే యువకులకు మాత్రం ఎటువంటి అనుమతి వుండదు. యువతులకు మాత్రం దీనిలో కొంత సడలింపు వుంటుంది. డిస్కోథెక్‌లోకి ప్రవేశించినాక అక్కడి పరిస్థితిని, హోటల్ స్థాయిని బట్టి డెన్‌ను తయారు చేస్తారు. తొలుత అందులోకి ప్రవేశం జరిగేముందే వింత వింత ఆకృతులతో ప్రవేశ ద్వారాలువుంటాయి. సహజంగా కొత్తగా వెళ్ళేవారికి మళ్ళా బయటకు ఎలా రావాలోకూడా తెలియని విధంగా మార్గాలు ఏర్పాటు చేస్తారు. అందులోకి ప్రవేశించాక వారిస్థాయిని బట్టి ఏ డ్రింక్ తీసుకోవాలో నిర్ణయించుకుని ముందుగానే దానికి సంబంధించిన డబ్బులు చెల్లించాల్సి వుంటుంది. అందులోకి వెళ్ళాక మందుబాబులు తాగే పనిలో నిమగ్నమవగానే వున్నట్లుండి ఒక్కసారిగా మిణుకుమిణుకు మనే అద్భుతమైన విద్యుత్ కాంతుల వెలుగులో ఇక్కసారిగా డెక్‌పై దర్శనమిస్తాడు డిస్క్‌జాకీ. అంతే వున్నట్టుండి వేల వాట్ల ధ్వనితో వచ్చే సంగీత హోరులో ఒక్కసారిగా ఈలలు, గోలలతో అందరూ ఒక్కసారిగా లేచి తమస్థాయిలో వికృత నృత్యాలు ప్రదర్శిస్తారు. ఇది డిస్కోథెక్‌ల తీరు.

క్యాబరే డాన్సుల తీరు

బార్లలో నడిచే క్యాబరే డాన్సుల తీరు గురించి వింటే యువతరం ఉప్పొంగిపోయే విధంగా వుంటుంది. తింటే పిజ్జాలే తినాలి చూస్తే క్యాబరే డాన్సు చూడాలి అన్న లెక్కన తయారైంది నగర యువత పరిస్థితి. నగరంలో బార్లలో హోటళ్ళలో నృత్యాలకు పర్మిషన్ తీసుకున్న బార్ల యజమానులు అనంతరం వాటిని క్యాబరే డాన్సులుగా మారుస్తారు. ఇక్కడకు సహజంగా ఇద్దరు అంతకంటే తక్కువగా స్నేహితులు వెళ్ళరు. ఇక్కడ కూడా మద్యపాన ప్రియులే ఎక్కువ. వారు అందించే మద్యం తీసుకుని టేబుల్‌పై మందు

బార్లలో డాన్సర్లపై జరిగే హింస

ఇటీవల సికింద్రాబాద్‌లో వున్న ఒకబార్ యజమాని డాన్సర్లను హింసించిన తీరు చూస్తే డాన్సర్ల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతుంది. బార్ యజమాని డాన్సర్లు వుంటున్న రూంలోకి వెళ్ళి తన అవసరం తీర్చాలంటూ పట్టుబట్టాడు. ఒక డాన్సర్ తన మాట వినలేదనే నెపంతో ఆమెను వివస్త్రను చేసి ఆమెపై బీరుపోసి హింసించిన తీరు సభ్యసమాజం తలదించుకునే విధంగా వుంది. రాజస్థాన్‌నుండి బార్లలో నృత్యాలు చేయటానికి ఇక్కడకు వచ్చిన వారికి కొంత కాలం బాగానే నడిచింది. తరువాత వారిని యజమాని వారిని వ్యభిచారానికి ప్రోత్రహించాడు దీనికి ఆ డాన్సర్లకు కొంత డబ్బు ఎర చూపాడు. వారు దానికి అంగీకరించక బార్‌లో పనిమానేసి తమ గదికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అర్ధరాత్రి వేళ తన అనుచరులతో అక్కడికి వచ్చిన యజమాని తప్పతాగి నాకే ఎదురుచెబుతారా అంటూ వారిని తీవ్రంగా హింసించి నానా యాగీ చేశాడు. చివరకు అతని బాధలు భరించలేక చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో సంఘటన వెలుగులోకి వచ్చింది.

సివ్ చేసస్తూ నృత్య ప్రాభవాన్ని చూసస్తూ కూర్చుండిపోతారు. కిక్కు ఎక్కువయ్యే కొద్దీ జేబులో డబ్బులు చేతి వేళ్ళ మధ్యలోకి చేరుకుంటాయి. ఇది వారికి అనందం, డాన్సర్లకు ఆదాయం. అయితే నగరం, శివారు ప్రాంతాల్లో వున్న బార్లలో, రిసార్ట్సులో డాన్సులకు, నృత్యాలకు పోలీసుల నుండికానీ, ప్రభుత్వం నుండి కానీ ఎటువంటి అనుమతి లేదు. అయితే వీరుకోర్టు ద్వారా పర్మిషన్ తీసుకుని వాటిని కొనసాగిస్తున్నారు. నగరంలో వీటిని నడపటం కష్టం కనుక నగర శివారు ప్రాంతాల్లోకి వీటిని మార్చుకుంటారు. ఇటువంటి నృత్యాలతో యువతరంలోని బలహీనతను అసరాగా చేసుకుని సొమ్ముచేసుకోవటానికి బార్ల యజమానులు ప్రయత్నిస్తున్నారనటంలో ఎటువంటి సందేహం లేదు. వీటి ప్రభావంతో యువతరం తమ చదువు అభివృద్ధి తదితర విషయాలను మర్చిపోయి అసాంఘిక కార్యకలాపాల వైపు మరలటానికే ఉపయోగపడుతున్నాయి. వీటన్నిటిదీ ఒకటే టైం. జరిగేది మాత్రం దానికి పూర్తి విరుద్ధంగా వుంటుంది. సాయంత్రం ఏడు ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే నృత్యాలు రాత్రి పదకొండు గంటలకు గతితప్పి, శృతిమించి వికృత చేష్టలు ప్రారంభమవుతాయి. ఇక్కడ నుండి అర్ధరాత్రి వరకు అర్ధనగ్న నృత్యాలు విచ్చలవిడిగా జరుగుతాయి.

ఇలాంటి డాన్స్‌లను నిషేధించా

ఎం.వి. కృష్ణారావు, నగర పోలీస్ కమీషనర్

నేను నగర కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించాక నగరంలో వున్న బార్ అండ్ రెస్టారెంట్లలో డాన్సులు, అర్కెస్ట్రా లను నిషేధించా. అయితే నేను గత సంవత్సరం డిసెంబర్ నెలలో వీటిని నిషేధిస్తే దీనిపై వారు హైకోర్టులో కేసును దాఖలు చేశారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో హైకోర్టు వారికి పర్మిషన్ ఇచ్చింది. ఇప్పటికి నగరంలో ఇట్లా పర్మిషన్ తెచ్చుకున్న బార్లు సుమారు 32 వరకు వున్నాయి. నేను కమీషనర్‌గా అధికారం చేపట్టక ముందు వున్న పోలీస్ కమీషనర్ బార్లలో డాన్సులకు అనుమతి ఇచ్చారు. నగర పోలీసుల నుండి మాత్రం ఎటువంటి అనుమతి లేదు. బార్ యజమానులు మాత్రం హైకోర్టు నుండి పర్మిషన్ తెచ్చుకున్నారు. కనుక వీటిపై చర్య తీసుకోవటానికి నాకు ఎటువంటి అధికారం లేదు.

ఇతర రాష్ట్రాల నుంచి డ్యాన్సర్లు

ఇక్కడకు వచ్చే యువతులు ఎక్కువగా రాజస్థాన్, మహారాష్ట్ర నుండి వస్తుంటారు. చదువు అందం అన్నీ వుండి కూడా తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబపోషణ కోసం ఈ వృత్తిలోకి వస్తుంటారు. వీరిలో ఎక్కువగా పేద మధ్యతరగతి వర్గాలకు చెందినవారే వుంటారు. అయితే ఇక్కడకు వచ్చేవారి జీవితాల వెనుక ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. డబ్బు రుచి మరిగిన బార్ యజమానులు ప్రస్తుతం వారి బార్‌లలో పనిచేసే వారి సహకారంతో ఇతర రాష్ట్రాలకు వెళ్ళి యువతులను తీసుకువస్తారు. ఎక్కువగా వీరిని రోజువారి వేతనాలపై ఒప్పందం కుదుర్చుకుని తీసుకువస్తారు. అట్లా వచ్చేవారిలో ఎక్కువమంది పేద మధ్య తరగతి యువతులే. డిగ్రీ వరకు చదివి పై చదువులు చదవటానికి ఆర్థిక స్తోమత లేక తప్పని పరిస్థితుల్లో యువతులు కుటుంబపోషణ కోసం ఈ వృత్తిలో దిగుతుంటారు. ఈ వృత్తిలో దిగటానికి కూడా మరో కారణం లేకపోలేదు. అక్కడి రాష్ట్రాల్లో యువతులు నాట్యం సంగీతం తదితర రంగాల్లో ప్రావీణ్యం సంపాదించుకుంటారు. అక్కడ వారికి తగిన ప్రోత్సాహం లేకపోవటంతో ఇక్కడకు వచ్చి బార్లలో డాన్సులు చేస్తుంటారు. బార్లలో డాన్సులు చేస్తూనే మందుబాబుల జేబులు కూడా ఖాళీ చేయాలి. ఇది వారి వృత్తిలో భాగం. అప్పుడప్పుడు యాజమానుల అవసరాలు కూడా తీర్చాలి లేదంటే



వారికి ఉద్వాసనే ఇక్కడ కొంత కాలం పని చేసిన తరువాత వారి డిమాండ్ తగ్గితే వారిని తీసేసి వేరే వారిని తెచ్చుకుంటారు. అయితే ఇక్కడ క్లబ్బుల్లో డాన్సులు చేస్తున్నప్పుడు జులాయిలు విసిరే టిప్పులో కొంత వీరికి ఇస్తారు. ఎవరు ఎక్కువ ఆకర్షిస్తే వారికి అధిక ప్రోత్సాహం వుంటుంది. ఒకసారి యువతులు ఈ రొంపిలోకి దిగాక మళ్ళా బయట పడటం చాలా కష్టం. అయితే బార్లలో డాన్సులు నిషేధించాలని చెప్పే పోలీసులు తగిన చర్యలు తీసుకోవటంలో మాత్రం మీనమేషాలు లెక్కపెడుతూ ప్రకటనలకే పరిమితమవుతున్నారు. బార్లలో జరిగే అసాంఘిక కార్యకలాపాలు బయటకు పొక్కకుండా చూసేందుకు బార్ యజమానులు రౌడీలు గూండాలను ప్రోత్సహిస్తూ వుంటారు. బార్లలో డాన్సులు చేయలేక ఎవ్వరైనా పారిపోవాలని చూస్తే వీరు తమ చక్రబంధంలో బందిస్తారు. బార్లకు వచ్చి ఎవరైన ఫొటోలు తియ్యాలని ప్రయత్నిస్తే వారు వారి తరహాలో బెదిరించి సాగనంపుతారు. బార్లలో డాన్సులు చేసే యువతులను పోలీసులు అరెస్ట్ చేస్తే వారి బాధలు ఇక వర్ణనాతీతం. బార్లలో పని చేసినంత కాలం వారిని ఉపయోగించుకుని లక్షలాది రూపాయలు దండుకునే యజమానులు పోలీసులు అరెస్టు చేశాక వారు ఎవరో తెలియనట్లు వ్యవహరిస్తుంటారు. ఇవే కాదు బార్లలో పనిచేసే డాన్సర్లను తమ అవసరాలు తీర్చాలంటూ యజమానులు హింసించే తీరు వినటానికే చాలా జుగుప్సాకరంగా వుంటుంది. దీనికి సంబంధించిన సమాచారం తీసుకుందామని వెళ్ళిన రిపోర్టర్లు కూడా అక్కడి పరిస్థితులు చూసి అవాక్కయ్యారంటే యజమానుల ప్రవర్తన ఏ విధంగా వుందో అర్థం చేసుకోవచ్చు. బయట అంత పద్ధతిగా వ్యవహరించేవారు క్లబ్బుల్లో నగ్న ప్రదర్శనలకు కూడా సిద్ధమవుతున్నారంటే దీని వెనుక ఎంత బలమైన కారణాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అయితే డాన్సర్లలో ఎక్కువ మంది కుటుంబపోషణకోసం డాన్సులు చేస్తే, మరికొందరు హాబీగా చేసేవారు కూడా లేకపోలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలి. యువతను పెడదోవ పట్టిస్తూ యువతులను విలాస వస్తువుగా చూపిస్తున్న నేటి పద్ధతి మారటానికి ప్రభుత్వ యంత్రాంగం, అభ్యుదయ కృషి చేయాలి. బార్ల యజమానులు ఇచ్చే లంచాలకు ఆశపడి ఇటువంటి వికృత చేష్టలకు అనుమతి ఇస్తున్న పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలి. బార్లలో పనిచేస్తున్న యువతులకు ప్రభుత్వం తరపున తగిన ప్రోత్సాహకాలు ఇచ్చి ఇటువంటి పరిస్థితిని మార్చటానికి కృషి చేయాలి. ★

అతిసార వ్యాధి

రాష్ట్రంలోని పలుప్రాంతాలలో ప్రతిసంవత్సరం అతిసారవ్యాధి కన్పిస్తోంది. ముఖ్యంగా మే, జూన్ నెలల్లో ఎక్కువగా ప్రబలుతోంది. మనకు ఈ వ్యాధి కొత్తకాకపోయినా ఏయేటి కాయేడు వ్యాధిని అదుపులో పెట్టడం కోసం ప్రభుత్వం పలుప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇటీవలనే మలేరియా, మెదడువాపు, అతిసార వ్యాధులకు ఒక కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించింది. వేసవికి ముందునుంచే అతిసార వ్యాధి నిరోధక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. సుమారు ఏడున్నర కోట్ల జనాభా వున్న ఈ రాష్ట్రంలో ఎన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నా, ప్రజల్లో వున్న శాస్త్రీయ అవగాహనారాహిత్యం, కొంతమంది అధికారుల్లో గూడుకట్టుకుని వున్న నిర్లక్ష్య ధోరణి వల్ల అతిసార వ్యాధి అదుపు తప్పుతూనే వుంది. ఈ పరిస్థితుల్లో అతిసార వ్యాధి పై శాస్త్రీయ అవగాహన అవసరం ఎంతో వుంది.

అతిసార వ్యాధి అంటే ఏమిటి?..

అతిసార వ్యాధినే 'గ్యాస్ట్రో ఎంటరైటిస్' అంటారు. మానవ శరీరంలోని జీర్ణవ్యవస్థ (గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ట్రాక్ట్) కు సోకే వ్యాధి ఇది. ఈ వ్యాధి సోకినపుడు జీర్ణ వ్యవస్థ పనితీరు అస్తవ్యస్థమై అసాధారణ విరోచనాలు, వాంతులకు గురికావడం జరుగుతుంది. దీనినే 'అతిసార వ్యాధి' గా పేర్కొంటారు.

వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది?

అతిసార వ్యాధికి వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు కారణమవుతున్నాయని వైద్య పరీక్షల్లో వెల్లడవుతున్నది. వీటిలో 'ఇ-కోలై' అనే బ్యాక్టీరియా కీలక పాత్ర వహిస్తోంది. అతిసార కారక సూక్ష్మజీవులు ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందడంలో త్రాగునీరు ప్రధాన పాత్ర వహిస్తుంది. అడుగంటిన బావుల్లోని నీరు, కొద్దిగా పారుతున్న కాలువలు, వాగులలోని నీరు, శుభ్రపరచకుండా తాగడం వల్లే అతిసార వ్యాధి సంక్రమిస్తోంది. ఈ నీటిలో అతిసార కారక సూక్ష్మ జీవులు చాలా ఎక్కువ కాన్‌సెంట్రేషన్‌లో ఉండడమే అందుకు కారణం. మన మూత్రాలపై, చెత్తాచెదారంపై వాలిన ఈగలు, ఇతర ఇన్‌సెక్ట్స్ ఆహార పదార్థాలపై వాలడం వల్ల, అవి సూక్ష్మ జీవులతో కలుషితమై వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్నాయి. తాగునీరు సరఫరా గల ప్రాంతాలలో పైపుల లీకేజీ వల్ల మంచినీరు కలుషితమై అతిసార వ్యాధి విజృంభిస్తోంది.

అతిసార వ్యాధి లక్షణాలేమిటి?

వ్యాధి కారక సూక్ష్మజీవులు ఇంతకు ముందే చెప్పినట్టుగా జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. గ్యాస్ట్రో ఎంటెస్టినల్ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్‌కు, ఇన్‌ఫ్లమేషన్‌కు గురి అవుతుంది. ఫలితంగా జీర్ణవ్యవస్థ పని తీరులో అసాధారణతలు మొదలయి వాంతులు, విరేచనాలు ప్రారంభమవుతాయి. దీనివల్ల విపరీతమైన దాహం వేస్తుంది. గొంతు, నాలుక ఎండిపోతాయి. కళ్ళు గుంటలు పడతాయి. చర్మంలోని నీరు ఇంకిపోయి, ముడతలు పడుతుంది. పాలిపోయినట్లు కన్పిస్తుంది. సాధారణ సాగే శక్తి (ఎలాసిటీ) ని కోల్పోతుంది. శరీర ద్రవాలలో ఎలక్ట్రొలైట్ ఇంబాలెన్స్ వస్తుంది. కోల్పోయిన నీటి శాతాన్ని పూరించకపోతే వ్యాధిగ్రస్థులు నీరసించి పోతారు. నిర్లక్ష్యం చేస్తే మరణం సంభవిస్తుంది. అతిసార వ్యాధికి గురవుతున్న వారిలో ఎక్కువగా పిల్లలు, వృద్ధులు ఉంటున్నారు. వీరిలో వ్యాధి నిరోధక శక్తి సహజంగా తక్కువగా ఉండడమే అందుకు కారణం అయి ఉండవచ్చును. వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం మంచిది.

వ్యాధికి చికిత్స ఏమిటి?

అతిసార వ్యాధి పూర్తిగా నిరోధించగలిగిన వ్యాధి. ఎక్కడైనా చికిత్స చేయవచ్చును. సంపూర్ణ చికిత్స ఉంది. నిజానికి ఈ వ్యాధికి వాడాల్సిన ప్రత్యేకమైన

మందులు ఏమీలేవు. సాధారణ యాంటీబయాటిక్స్, యాంటీ డయేరియల్స్, ఓరల్ ఫ్లూయిడ్స్, అవసరమైన ఐ.వి. (ఇంట్రాలినస్) ఫ్లూయిడ్స్ ద్వారా వ్యాధిని పూర్తిగా అదుపులో పెట్ట వచ్చును.

అయితే మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయి?

వ్యాధిగ్రస్థుల నిర్లక్ష్యమే చాలా సందర్భాలలో అతిసార మరణాలకు కారణమవుతుంది. వ్యాధి లక్షణాలైన వాంతులు, విరేచనాలు ప్రారంభమయిన వెంటనే చికిత్స ప్రారంభించాలి. చికిత్స ఇంటిలోనే మొదలు పెట్టవచ్చును. అయినా చాలా మంది బాధితులు చికిత్స ప్రారంభించడం లేదు. అదే తగ్గుతుందని వ్యాధిని నిర్లక్ష్యం చేస్తున్నారు. వ్యాధి అదుపు తప్పుతున్న స్థితిలో కొందరు నకిలీ వైద్యుల్ని ఆశ్రయిస్తున్నారు. వారి అరకొర వైద్య పరిజ్ఞానపు చికిత్స కొన్ని సందర్భాలలో ప్రాణాంతకమవుతున్నది. కొందరు క్వాలిఫైడ్ వైద్యుల్ని సంప్రదించినా, వ్యాధి కాస్త తగ్గుముఖం పట్టగానే చికిత్స మానేస్తున్నారు. మరి కొందరు మూఢనమ్మకాలతో, అపోహలతో వైద్యానికి ముందుకు రావడంలేదు. మొక్కుబడులకు ప్రాధాన్యత ఇచ్చి, ప్రాణాలకే ముప్పు తెచ్చుకుంటున్నారు. అతిసార వ్యాధిగ్రస్థులు బాగా నీరసించిపోయి, ప్రాణాపాయ స్థితిలో...చికిత్స వైద్యుని చేయి దాటిన పరిస్థితులలో...చదువుకున్న వారో...ప్రభుత్వ అధికారులో...రోగుల్ని ఆసుపత్రుల్లో చేర్చడం జరుగుతోంది. అప్పటికే ఈ రోగులు కొన ఊపిరితో ఉండడమో, మరణించడమో జరుగుతున్నది. మూత్రపిండాలు పూర్తిగా చెడిపోయి (రీనల్ ఫెయిల్యూర్) కొన ఊపిరితో ఉన్న రోగులకు ఎంత ఖర్చు పెట్టి, ఆధునిక వైద్యసదుపాయాలు కల్పించినా ఫలితం దక్కడం లేదు. మరణాలు తప్పడం లేదు. అతిసార వ్యాధికి గురైనవారు నిర్లక్ష్యం చేయకుండా ముందుకు వచ్చి ఆరోగ్య కార్యకర్తలు, వైద్యుల సలహాలు పొందితే మరణాలను పూర్తిగా నిరోధించవచ్చును.

ఓ.ఆర్.టి. అంటే ఏమిటి? దీని ప్రాధాన్యత ఏమిటి?

ఓ.ఆర్.టి. అంటే ఓరల్ రీ హైడ్రేషన్ థెరపి శరీరం వాంతులు, విరోచనాల ద్వారా కోల్పోయిన నీటి శాతాన్ని, ఎలక్ట్రోలైట్స్‌ను నోటిద్వారా ద్రవరూపంలో ఇవ్వడం ద్వారా చేసే ప్రాథమిక చికిత్సా విధానం ఇది. అతిసార వ్యాధికి గురైన వారిలో వాంతులు, విరోచనాల ద్వారా శరీరంలోని నీటి శాతంతోపాటు, సోడియం, పొటాషియం బై కార్బొనేట్, క్లోరైడ్ వంటి ఎలక్ట్రోలైట్స్‌ను కూడా కోల్పోవడం జరుగుతుంది. ఇవి దేశ జీవనానికి ఎంతో అవసరం. మనం తాగేనీటిలో అతి తక్కువ పరిమాణంలో ఈ ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. అతిసారకు గురైన వారిలో కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ లోపాన్ని



సరిదిద్దడానికి అవి ఏమాత్రం సరిపోవు. అందువల్ల అదనంగా ఎలక్ట్రోలైట్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ఎలక్ట్రోలైట్స్ లోపాన్ని, కోల్పోయిన నీటి శాతాన్ని నోటి ద్వారా సులభంగా ఇవ్వడం ద్వారా సరిదిద్దేందుకు రూపొందించిన ద్రవమే ఓ.ఆర్.ఎస్., ఓ.ఆర్.ఎస్. అంటే ఓరల్ రీ హైడ్రేషన్ సొల్యూషన్. ఈ ద్రవం ద్వారా చికిత్స చేయడాన్నే ఓ.ఆర్.టి. అంటారు. ఇది పౌడర్ రూపంలో ప్యాకెట్‌లలో లభ్యమవుతుంది. పరిశుభ్రమైన నీటిని కలవడం ద్వారా ద్రవాన్ని తయారు చేసుకోవాలి. నీరు ఎంత కలపాలో, ఎలా కలపాలో ఆ ప్యాకెట్‌పైనే ముద్రించి ఉంటుంది. ఓ.ఆర్.టి. ప్యాకెట్‌లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలోనూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోను ఇవి లభ్యమవుతాయి. సమయానికి రోగికి ఈ ప్యాకెట్‌లు అందుబాటులో లేకపోతే పరిశుభ్రమైన కాచి వడపోసిన నీటిలో చిటికెడు ఉప్పు, కొద్దిగా పంచదార కలిపి ఇవ్వవచ్చును. ఇది కూడా ఓ.ఆర్.టి లానే పనిచేస్తుంది.

అతిసార వ్యాధి నిరోధం
తీసుకోవలసిన జాగ్రత్తలు

అతిసార నిరోధంలో వ్యక్తిగత జాగ్రత్తలు అత్యంత ప్రధానమైనవి. ఈ జాగ్రత్తలు పాటించడంలో మహిళలదే కీలకపాత్రగా పేర్కొనవచ్చును. మహిళలు అప్రమత్తంగా ఉంటే అతిసార వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చు ననడంలో అతిశయోక్తి లేదు.

మరోవైపు ప్రస్తుత ప్రభుత్వం అతిసార వ్యాధిని నిరోధించేందుకు పలు ముందు జాగ్రత్త చర్యలను చేపడుతున్నది. ప్రజల్ని అప్రమత్తం చేసేందుకు ఓ.ఆర్.టి. వారోత్సవాలను, అతిసార వ్యాధి శాస్త్రీయ అవగాహనా శిబిరాలను నిర్వహిస్తోంది. అతిసార వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్క పౌరుడూ సహకరించాలి. ఏ ప్రాంతంలోనైనా అతిసార వంటి అంటువ్యాధులు ప్రబలితే వెంటనే ప్రజలు ఆ సమాచారాన్ని స్థానిక, ఆరోగ్య సిబ్బందికి, అధికారులకు తెలపాలి. అది ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతి ఒక్క పౌరుడూ బాధ్యతగా భావించాలి.

ప్రజలు, ప్రభుత్వం సంయుక్తంగా కృషిచేస్తేనే "అతిసార" రహిత సమాజం సాధ్యమవుతుంది.

(హెల్త్ హెల్ప్ సౌజన్యంతో)

*ముదిగంటి సుజాతారెడ్డి

ప్రకటనలు! ప్రకటనలు!!



ఈ మధ్య ఒక కొత్త హీరో నటించిన సినిమా పాటల క్యాసెట్ విడుదల ఫంక్షన్‌లో ఆ హీరోను ఒక సంతలో పశువును అమ్మకానికి కట్టేసి వుంచినట్లుగా, లైట్ల మధ్య ముఖ్‌మల్ గుడ్డమీద దుకాణంలో వినియోగదారులను ఆకర్షించేందుకు పెట్టిన వస్తువు మాదిరిగా అందర్నీ ఆకర్షించేట్లుగా నిలబెట్టడం చూసి అందరికీ ఆశ్చర్యం కలిగింది. అసలైతే ఆశ్చర్యపడే అవసరం లేదు. ఈ పబ్లిసిటీ ప్రకటనల యుగంలో ప్రతి ఒక్కరూ తమ వస్తువును అమ్ముకోవడానికి చిత్రవిచిత్రమైన మార్గాలను వెతుక్కుంటున్నారు! అదే విధంగా కొత్త హీరోకు కావల్సిన పబ్లిసిటీ కోసమే ఈ సంత అంతా అని అర్థమవుతూనే వుంది.

అప్పుడే పబ్లిసిటీ అంటే గుర్తుకు వచ్చింది నాకు. విక్రమ్ సేథ్ పుస్తకం ఒకటి 2004లో రాబోతోంది. దానికోసం ప్రచురణ కర్తలు ఇప్పట్నుంచే పబ్లిసిటీ మొదలు పెట్టిన విషయాన్ని పత్రికల్లో చూశాన్నేను. కాని కళ, సాహిత్య రంగాల్లో కూడా ఇటువంటి ప్రకటనలు, పబ్లిసిటీ సహాయం తీసుకోవడం అనారోగ్యంగానే కన్పిస్తున్నది. ప్చ్!... ఏం జేస్తాం! – ఈ యుగమే పబ్లిసిటీ, ప్రకటనల యుగం!– ఈ ఆలోచనల్లో మునిగిపోయి వున్నాన్నేను. అప్పుడే 'పోస్ట్!' అని అరుపు వినపడింది. బయటికి పోయి చూస్తే పోస్టుమ్యాన్.

రిజిస్టర్ ఉత్తరం తీసుకున్నాను. దాంతో పాటు మరో ఉత్తరం ఒకటి చేతికిచ్చాడు. ఉత్తరం రంగురంగుల బొమ్మలతో కవరు ఆకర్షణీయంగా వుంది. పరిశీలనగా చూశాను. కవరు మీద కారు బొమ్మ... కారు ఉత్తమమైందనీ ఆ కారు కొనడానికి బ్యాంక్ అప్పు ఇస్తుందన్న ప్రకటనలు చూశాను. 'హూఁ మరో ప్రకటన యుద్ధం ఇది!' ఆ కారును ఎట్లయినా సరే మాతో కొనిపించాలని చూస్తున్నారు అటు కారు తయారు చేసే వాళ్ళు, ఇటు బ్యాంకు వాళ్ళు! – అని కవరును తెరవకుండానే చెత్త కాగితాల బుట్టలో పడేశాను. అది జరిగాక వారం రోజుల కొక ఉత్తరం కొరియర్‌లో వచ్చింది. ఉత్తరాన్ని మా ఆయన తెరిచాడు.

"ఏంటీ ఇంతకుముందు నీకేదైనా బిల్లు వచ్చిందా!" అని అడిగాడు.

"ఏం బిల్లూ రాలేదు" అన్నాన్నేను తెల్లబోతూ.

"బిల్లంటే నువ్వు క్రెడిట్ కార్డు తీసుకున్నావు కద. ఆ క్రెడిట్ మీద ఏమైనా కొన్నావా?" అని అడిగాడు.

"అవును కొన్నాను. క్రెడిట్ కార్డు బోణీని చీరలతోనే చేయాలని రెండు చీరలు కొన్నాను" అన్నాన్నేను.

"అదే ఆ బిల్లునే క్రెడిట్ కార్డు ఇచ్చిన బ్యాంకు వాళ్ళు నీకు పోస్టులో పంపారు. ఆ బిల్లును సకాలంలో చెల్లించకపోయే సరికి ఇదిగో పెనాల్టీతో బిల్లు చెల్లించమని మరో ఉత్తరం వచ్చింది కొరియర్లో" అని చూపించాడు.

"అసలు ఇంతవరకు బిల్లేదీ రాలేదు నాకు. అది రాకుండానే ఈ పెనాల్టీతో బిల్లు చెల్లించమని ఉత్తరమేమిటి. అస్సలు నాకు ఈ క్రెడిట్ కార్డే వద్దు అంటే ఆ బ్యాంకు వాళ్ళు వెంటబడి అంటగట్టారు. నాకు అప్పులంటే పడదు. అప్పు అనే పదం వింటేనే గుబులు లేస్తుంది. నాకు క్రెడిట్ కార్డు వద్దంటే పదిసార్లు ఫోన్లు చేసి ముద్దుముద్దుగా తియ్యగా మాట్లాడి నాకీ క్రెడిట్ కార్డు అంటగట్టారు. ఇప్పుడేమో బిల్లు చెల్లించలేదని దాని మీద పెనాల్టీ! అసలు ఈ పెనాల్టీ డబ్బుల కోసమే ఈ బ్యాంకు వాళ్ళు నాకీ కార్డు తగిలించి లాభపడాలని చూశారు! మరేమో క్రెడిట్ కార్డును ఉపయోగిస్తే ఏం వడ్డీ వుండదు. ఎక్స్‌ట్రా పేమెంట్ వుండదని చెప్పారు. చూడండి! ఈ చీరెలు కొన్నందుకు నేను పెనాల్టీ ఎందుకు కట్టాలి! నేను కట్టను" అన్నాన్నేను మొండిగా.

"సుశీ! అట్లా మొండికేస్తే నడవదు. ఇది బ్యాంక్ వ్యవహారం. కట్టనంటే ఎట్ల." నచ్చజెప్పాలని మా ఆయన తాపత్రయం.

"నేను పెనాల్టీ కట్టనంటే కట్టను" అన్నాన్నేను. ఇంకా మొండికేస్తూ.

"బాగుంది! పెనాల్టీతో నువ్వు చెక్ ఇయ్యకపోతే మరింత పెనాల్టీతో మరో బిల్లు వస్తుంది!"

"రానీయండి. నాకు మొదటిసారి బిల్లు పంపనే లేదు వాళ్ళు. ఇప్పుడు ఏకదమ్ పెనాల్టీతో బిల్లు పంపి నన్ను ముంచాలని చూస్తున్నారు వాళ్ళు. నేను కట్టనే కట్టను" అన్నాన్నేను.

"అవునూ! ఈ మధ్య... అంటే పోయిన వారంలో ఏమేమి ఉత్తరాలు వచ్చాయో జ్ఞాపకం చేసుకో" అన్నాడు.

"ఒక రిజిస్టరు కవరు వచ్చింది...ఆ!... దాంతోటి ఒక కారు యాడ్స్‌తో నిండిన రంగురంగుల కవరు వచ్చింది" అన్నాన్నేను.

"దానిలో ఏముంది?"

"ఏమో! ఏముంటుంది. కారును గురించి వివరాలుండి ఉంటాయి" అన్నాన్నేను సంశయంగా.

"ఆ కవరులో బిల్లు లేదు కదా?..." అడిగాడు ఆయన.

"అది కారు యాడ్.... ప్రకటన అని తెలుస్తూనే వుంది పైన వున్న బొమ్మలను బట్టి..."

"అదేం కాదు. అదే బిల్లుతో పంపిన కవరు! ఏదీ ఆ కవరు?" అంటూ చేయి చాపాడు.

"పారేశాను. ప్రకటనే కదా అని పారేశాను."

"చూడు! ఆ చెత్త కాగితాల్లో ఆ కవరు వుందేమో" అని చెత్త కాగితాల బుట్టను వెతికి ఆ రంగురంగుల కవరును బయటికి లాగాడు.

"ఆఁ... అదే! బ్యాంకు ఉత్తరమైతే తెల్లగా ఉంటుంది కాని అట్లా రంగురంగుల్లో వుంటుందా? చూడండి!" అన్నాన్నేను. ఇంతలో కవరు చింపి లోపల్నుంచి తెల్లకాగితం తీశాడు. చూస్తే అదే బిల్లు!

అయినా బ్యాంకు వాళ్ళు తమ ఉత్తరాన్ని "ఈ ప్రకటనల వేషంలో పంపడమేమిటి? ప్రకటనలు ఇటువంటి ఉత్తరాలను కూడా వదిలెయ్యవా?" అని ఆ రంగురంగుల ఉత్తరం వైపు ఉరిమి చూశాను. పెనాల్టీ కట్టడం ఇక తప్పదు గదా – అనే కోపంతో.

ప్రకటనలు ఏ రూపంలో ఎక్కడ దాగి వుంటాయో తెలియదు అని నిట్టూర్చాన్నేను వెంటనే నిస్సహాయంగా.

★



మనిషి కోసం

సత్యం కోసం ముమ్మరంగా వెతుకుతూనే
తత్వం కోసం గాఢంగా శోధిస్తూనే
మారుతున్న రుతువులకనుగుణంగా
నేర్పుగా బతకడం సాధన చేశాను.
***
అయినా నా ఆరాటం తీరలేదు
ఆశలు ఫలించ లేదు
పరిశోధనలు వికటిస్తూనే ఉన్నాయి
వెలితి అదే పనిగా వెక్కిరిస్తూంది.
***
పనులనెన్నో నేర్చుకున్నాను
విజయాలనూ సాధించాను
ఎక్కడెక్కడ్నో తిరిగి తిరిగి
ప్రపంచ పోకడలను గుప్పిట పట్టాను.
***
కానీ నిత్యం క్షీణిస్తున్న
సామాజిక సమతుల్యతలను
మరుగుజ్జవుతున్న మనిషితనాన్ని
జీర్ణించుకోలేకపోతున్నాను.
***
రాతి బొమ్మలా ఉండలేక
తిరిగి మళ్ళీ అసలైన
మనిషిని కనుగొనాలని
మనిషి దొరికితే ఆ మనిషిలో
మనసుందో లేదో పరీక్షించాలని
మరో ప్రయత్నంగా
లోక సంచారిగా...

- అనిశెట్టి రజిత

కాల బిలం

సమస్యలు తీరా తెరకెక్కితేనే
తలలు వేడెక్కుతుంటాయ్!
ఈ దేశంలో 'స్కాం' జరగని
జాము లేదనే యదార్థం ముందు
ఊహ తప్ప ఏ ఆధారము లేని
ఎన్నో అనాథ వాదాలు
ప్రతి క్షణం నిశ్శబ్దమైపోతూ
వేదనా ప్రపంచంలో
విగత జీవుల్లా తపిస్తూంటే..
కొండంత 'స్కాం'నైనా
ఇట్టే దిగమింగి అట్టే అరాయించుకుంటూ
అధికారం కేంద్రంగా ఓ నిశా గహ్వరం!
వల పన్నిన వేటగాడి మాటెక్కడో తెలీదు
ఇప్పుడన్నీ హైటెక్ వలలే కదా!
వద్దిన ప్రాంతం నుంచి ఊపిరోసుకొని
ఉచ్చులు పాకి పోతూ...
తెల్లారేటప్పటికి తల వాకిట
ఓ అదృశ్య నిర్బంధమై వాలి తలుపు
తడుతుంటే...
ఉలిక్కిపడ్డ కలల్లోంచి
ఊపిరిలేని ఊహల్ని చప్పరిస్తూ బయటకు
వస్తే...
భవితను తెగనరికే ఓ తల్వార్ కింద తల



భయంకర వైరస్‌కు వాహకంగా శరీరం
దేశ సౌభాగ్యపు పాడె బిగింపుకు
సన్నద్ధమౌతున్న చేతులు
బతుకంతా బంజరై విస్తరిస్తున్న
ఒక ఎడారి కల
మిథ్యా జగత్తును మనిషి చుట్టూ అల్లిస్తున్న
మల్టీ కంపెనీల వల!
సమస్తాన్ని మాయజేసే మేథో నాగ
స్వరానికి
అనుగుణంగా అతి లాఘవంగా
అడ్డంకుల అధిగమిస్తూ
అల్లె తాకేందుకు
పాదాలు మొలిపించుకుంటూ
సామాన్యుడేస్తున్న మోడి!
ఆర్థిక రద్దీలో దారి తప్పిన అడుగు
చెవి లోలాకులా ఊగిసలాడుతున్న బతుకు
పాలపుంతలో కాల బిలంలా నోరు తెరచి
మండుతూ పొగలెల్లుతూ
మింగేందుకు అదను జూసి
అభయాస్త్రంలా ముందుకొస్తున్న మృత్యువు!
ప్రాణం పోయినా నిర్బంధాల్ని తెంచాలని
తెగించే జనం కోసం ఎన్నేళ్ళయినా
ఎదురు చూడాల్సిందే!
వెతుక్కోవాల్సిందే!!

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి

* అమ్మిన శ్రీనివాసరాజు



"అమ్మా! నాకు ఓ రూపాయి ఇవ్వవా?" అంది సాయి స్కూలుకు వెళ్లడానికి పుస్తకాల బ్యాగ్ సర్దుకుంటూ.. 'ఏంటీ! నిన్ననేగా మీ మామయ్య వెళ్తూ పది రూపాయల నోటు ఇచ్చాడు. ఏం చేశావే!?' అంటూ కొట్టబోయింది వాళ్ల అమ్మ అరుణ. చెప్పడానికి సమాధానం లేక ఆ రోజు ఖర్చుపెట్టుకోవడానికి డబ్బు లేక నీళ్ళు నిండిన కళ్ళతో బిక్కమొహం వేసింది ఐదో తరగతి చదువుతున్న సాయి.

డబ్బు విలువ తెలియజెప్పాలి

సాధారణంగా ఈ రోజుల్లో స్కూలుకు వెళుతున్న పిల్లలకు ప్రతిరోజూ ఎంతోకొంత డబ్బు ఇవ్వడం పరిపాటి అయిపోయింది. అది కాస్తా అలవాటుగా మారి ఒక్కోసారి ఆ డబ్బులు (చిల్లర డబ్బు) సమయానికి లేక ఇవ్వకపోతే ఇక ఆ రోజుకు స్కూలుకే వెళ్ళనని మొండికేసే పెంకెపిల్లలూ లేకపోలేదు. పిల్లల మీదున్న ప్రేమతోనో, గారాబం కొద్దో ఇచ్చే ఈ చిల్లర డబ్బులే రానురానూ వారిలో ప్రభావం చూపి చిరుతిండ్లకు అలవాటుపడి ఆరోగ్యం పాడుచేసుకుంటారు, కొన్ని సందర్భాల్లో సమయానికి డబ్బులు లేక పక్కవారి దగ్గర దొంగిలించడం లేదా తమ పుస్తకాలు, పెన్నులు తోటి వారికి అమ్మివేయడం వంటి చెడు పనులకు బానిసలవుతున్నారు.

అయితే ఈ చిన్న వయసులో పిల్లలకు డబ్బుతో సంబంధం లేకుండా చేస్తేనే ఒక రకంగా బాగుంటుంది. కనీస వయస్సు, ఊహ వచ్చాక బాధ్యతలు తెలిశాక పిల్లలకు డబ్బులు పరిచయం చేయడం ఉత్తమం. బాధ్యతలు తెలిసి వచ్చే వరకూ పిల్లలకు పెద్దలే వారికి కావల్సిన వస్తువులు కొనివ్వడం మంచిది. బాధ్యతలు తెలిశాక అయినా ఖర్చు పెట్టే తీరులో కూడా పిల్లలకు మెలకువలు చెప్పాలి. డబ్బులు ఖర్చు పెట్టడంలో కూడా చిన్నతనం నుంచే ఒక ప్రణాళిక (బడ్జెట్) అలవాటు చేయాలి. డబ్బును ఖర్చు పెట్టడమే గాక స్వయంగా కష్టపడి ఆ వచ్చిన డబ్బుతో ఒక వస్తువు కొనుక్కుంటే కలిగే ఆత్మసంతృప్తి, ఆనందం పిల్లలకు అనుభవ పూర్వకంగా తెలియజేయాలి. అలా చేసిన సందర్భాల్లో వారిని తగిన విధంగా ప్రోత్సహించి అందరి ముందూ పొగడాలి. తద్వారా పిల్లల్లో స్వయంగా కష్టపడి డబ్బు సంపాదించే గుణం చిన్నతనం నుంచి అలవడుతుంది.

అలాగాక కొందరు పెద్దలు ప్రతి చిన్న విషయానికి ఎంతో కొంత డబ్బులు ఇవ్వడం ప్రేమతో అలవాటు చేస్తారు. ఇక దాంతో స్కూలుకు వెళ్లడం మొదలు స్నానం చేయడానికి, బట్టలు వేసుకోవడానికి, ఆఖరికి అన్నం తినడానికి కూడా పిల్లలు డబ్బులు అడగటం, ఇవ్వకపోతే పేచీ పెట్టడం చూస్తుంటాం! కొన్ని కుటుంబాల్లో తండ్రికి తెలియకుండా తల్లి, తల్లికి తెలియకుండా తండ్రి పిల్లలకు డబ్బులు ఇస్తారు. ఇంటికి ఎవరైనా చుట్టాలు బంధువులు వచ్చినప్పుడు వెళ్తూ, వెళ్తూ వాళ్లు కూడా పిల్లలకు అధిక మొత్తాల్లో డబ్బులు ఇవ్వడం జరుగుతుంది. తద్వారా పిల్లలకు చిన్న తనం నుండే బాధ్యతా రహితమైన ఖర్చులు అలవడతాయి. ఊరకే వచ్చిన డబ్బే కదా అన్న ఆలోచనతో పిల్లల్లో అనవసర ఖర్చులు దుబారాలు పెరిగి పోతాయి.

కొన్ని కొన్ని సందర్భాల్లో పిల్లలు డబ్బులు ఖర్చు పెట్టడానికి పక్కవారితో పోల్చుకుంటారు. ఎదుటి వారు చేసే ఖర్చులు తామూ చేయాలనుకుంటారు. వారు కొన్న వస్తువులు తమకూ కావాలని మారాం చేస్తుంటారు. తమ ఫ్రెండ్స్ ముందు తాము 'పిసినార్లు'గా ఫీలు కావల్సి వస్తుందని పెద్దల ముందు గొడవ చేస్తారు. ఇలాంటి సందర్భంలో పిసినార్లకు పొదుపర్లకు తేడా తెలియజేయాలి. పొదుపుగా వుండటం వల్ల భవిష్యత్ లాభాలు పిల్లలకు అర్థమయ్యేటట్లు ఉదాహరణలతో అనుభవాలు జోడించి తెలియజేయాలి.

పిల్లల భావిజీవితాలకు అత్యంత ప్రధానమైన 'డబ్బు' గురించి దాన్ని సంపాదించడంలో ఉండే సాధక బాధకాలు, ఖర్చు పెట్టడంలో వుండే నియమం ప్రణాళికల గురించి. అలాగే డబ్బు సంపాదనలో పాటించాల్సిన నిజాయితీ గురించి పిల్లలకు కథల రూపంలోనూ.. అనుభవ సన్నివేశాల రూపంలోనూ వివరించాలి. అనవసర ఆర్భాటపు ఖర్చుల ద్వారా కలిగే నష్టాలు - కష్టాలు డబ్బును సంపాదించడంలో చేసే అక్రమాలు - లంచగొండి తనాలు తద్వారా కలిగే అపవాదులు - శిక్షల గురించి కూడా పిల్లలకు అటు అధ్యాపకులు ఇటు తల్లిదండ్రులు నిత్యం తెలియజేస్తూ ఉండాలి.

తల్లిదండ్రులు కూడా పిల్లలను డబ్బుల విషయంలో జాగ్రత్తగా గమనిస్తుండాలి. వారి మీదున్న అతి ప్రేమకు డబ్బులు జోడించి హద్దులేకుండా అడిగిన దాని కల్లా డబ్బులు అందించి అనంతరం లేనిపోని అవస్థలు పడేకన్నా ముందు నుండే జాగ్రత్త వహించడం మంచిది. పిల్లలకు కావల్సిన డబ్బులు ఇచ్చినా వాటి ఖర్చుకు సంబంధించిన ఆరాలు తీస్తుండాలి. అవసరమైతే ఖర్చులు వ్రాసి చూపించి మిగిలిన డబ్బులు తిరిగి ఇచ్చేయమనాలి. డబ్బుల విషయంలో పెద్దలు పిల్లల పట్ల ఇలాంటి నిబంధనలు అమలు చేస్తే పిల్లలు కూడా అనవసర ఖర్చులకు అలవాటుపడరు. డబ్బు విలువ తెలుసుకుని భయంగా ఖర్చుచేయడం నేర్చుకుంటారు.

పిల్లల్లో చేకూరే పొదుపు చర్యల ద్వారా అందరికీ ఉపయుక్తం అనే విషయం అన్ని వర్గాల వారు ఆలోచించాలి. ఆచరణాత్మకంగా అవలంబించాలి.

★

* పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

కొత్త బూట్లు

పిల్లలందరూ రోడ్డు మీద ఆడుకుంటున్నారు. ఫుట్‌బాల్, క్రికెట్, కర్రబిళ్ళ, దొంగాట.. ఇలా రకరకాల ఆటలు ఆడుతున్నారు. మురళి ఆ రోజు ఆడుకోవడానికి వెళ్లలేదు. వరండాలోనే కూర్చుని చూస్తున్నాడు. అక్కడ పిల్లలాడుతున్న ఏ క్రికెట్‌నో, ఫుట్‌బాల్‌నో చూస్తున్నాడనుకుంటే పప్పులో కాలేసినట్లే. అతను ఆత్రంగా చూస్తున్న మాట నిజమే. కానీ ఆటని కాదు. రోడ్డు మలుపులో అతని చూపులు చిక్కుకున్నాయి. "ఆ వచ్చేది నాన్నేనా? కొత్త బూట్లు కొనుక్కొస్తున్నారా? ఎలాంటివి తెస్తారు?" వంటి బోలెడన్ని ప్రశ్నలు అతని బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి. .

అటుగా రోడ్డు మీద వస్తున్న సైకిళ్లన్నింటినీ జాగ్రత్తగా గమనిస్తున్నాడు మురళి. హోంవర్కు కూడా చేయలేదు. చేయాలనిపించలేదు. వాడి ధ్యాసంతా నాన్న తెచ్చే బూట్ల మీదే వుంది.

మురళివాళ్ల స్కూల్లో చాలా మంది పిల్లలు కొత్త జోళ్లు కొనుక్కున్నారు, కొంతమంది అయితే కొత్త బూట్లు కూడా తొడుక్కున్నారు. ఒక్కోటి ఒక్కో రకంగా వుంది. "అన్ని రకాల బూట్లు తనకుంటేనా?" కొండంత ఆశ కలిగింది మురళికి. ఆ ఆశనే తండ్రి ముందు వెలిబుచ్చాడు. ఆయన పట్టించుకున్నట్లు కనిపించకపోయేసరికి అన్నం తిననని భీష్మించుకుని కూర్చున్నాడు. 'ఈ రోజు తప్పకుండా బూట్లు తెస్తాను' అని తండ్రి మాటిచ్చిన తర్వాతే స్కూలుకి వెళ్లాడు. అందుకే స్కూలు నుండి వచ్చినప్పటి నుంచి తండ్రి రాకకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు.

నాన్న తీసుకొచ్చే కొత్త బూట్లు ఎన్నో ఆలోచనలు రేవుతున్నాయి. ఆనందపు పులకరింతలు కలిగిస్తున్నాయి. బూట్లు వేసుకుని ఎలా నడవాలో? ఎలా పరిగెత్తాలో? మనసులోనే అనేకసార్లు ప్రాక్టీసు చేసుకున్నాడు. తోటి బడిపిల్లలు తన కొత్త బూట్లు చూసి ఎంతగా కుళ్లిపోతారో కూడా ఊహించుకున్నాడు. రోజూ ఖాళీ చేతులతో వచ్చి "రేపు చూద్దాంలే!" అని సమాధానపరిచి కాగితాల్లో తలదూర్చేసే నాన్న ఈ రోజన్నా బూట్లు తెస్తారా?అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. మురళి ఆలోచనలు తండ్రి తెచ్చే బూట్ల చుట్టూనే తిరుగుతున్నాయి. అందుకే ఆయన కోసం ఎదురు చూస్తున్నాడు.

మురళి ఆలోచనల మధ్యలో వుండగానే తండ్రి సైకిల్ సందు మలుపు తిరిగింది. అతను గమనించనేలేదు. ఇంకా ఏవేవో ఆలోచనల్లోనే వున్నాడు. ఇంటి ముందుకు వచ్చి తండ్రి సైకిల్ బెల్ మోగించేసరికి ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి బయటపడ్డాడు.

ఒక్క పరుగున వీధిలోకి వచ్చాడు. సైకిల్‌మీద బూట్ల ప్యాకెట్ కనిపించింది. అతని ఆనందానికి అవధులు లేవు. ఒక్క క్షణంలో తండ్రి దగ్గరికి చేరాడు. మురళి ఆనందాన్ని గమనించిన తండ్రి కూడా సంతోషపడ్డాడు. ఆ ఉద్రేకంలో కాస్త వేగంగా సైకిల్‌మీద నుండి దిగాడు. దాంతో అంతవరకూ కొనపట్టులో వున్న ఆయన ఎడమకాలి స్లిప్పర్ తెగిపోయింది.

చెప్ప కాలినుండి జారిపోయింది. బలవంతాన కాలివేళ్లతో పట్టుకోబోయాడు. పట్టు దొరకలేదు. చెప్ప కింద పడిపోయింది. కాలు పైకొచ్చేసింది. కాళ్లకి చెప్పులులేక, సైకిల్‌ని ముందుకు నడవలేక అక్కడే నిల్చుండిపోయాడాయన అశక్తుడిలా. వెంటనే తేరుకుని దగ్గరకు వచ్చిన మురళికి కొత్త బూట్ల ప్యాకెట్ అందించాడు.

మురళిలో అంతవరకూ వున్న ఆనందం ఎక్కడికి పోయిందో అర్థంకాలేదు. తండ్రి అందించే బూట్లని ఆనందంగా అందుకోవడానికి బదులు బాధగా ఆయన కాళ్ల వంక చూస్తూ నిలబడిపోయాడు.



క్విజ్-76

1. రేడియోను కనుగొన్నది ఎవరు?
   ఎ. మార్కోని బి. ఐన్‌స్టీన్
2. 'ఆలీస్ ఇన్ వండర్ లాండ్' రచయిత ఎవరు?
   ఎ. లూయిస్ కారల్ బి. ఆచార్య తులసి
3. రెడ్‌క్రాస్ దేనికి చిహ్నము?
   ఎ. ఆసుపత్రి లేక వైద్యపరికరములు బి. కుటుంబనియంత్రణ
4. లిల్లీపువ్వు ఏ దేశ జాతీయ పుష్పము?
   ఎ. ఫ్రాన్స్ బి. బ్రిటన్
5. బంగాళాదుంపలో గల ఆహార పదార్థము ?
   ఎ. పిండిపదార్థము బి. ఖనిజములు
6. ఇంధనములను మండించిన వెలువడు శక్తి?
   ఎ. ఉష్ణశక్తి బి. ధ్వని
7. మూత్ర పిండాల ఆకారము?
   ఎ. అర్ధచంద్రాకారము బి. చిక్కుడుగింజ ఆకారము
8. పర్వతారోహకులు తమ వెంట తీసుకొనిపోవు వాయువు?
   ఎ. కార్బన్‌డై ఆక్సైడ్
   బి. ఆక్సిజన్
9. ముఖ్యమంత్రిని నియమించునది?
   ఎ. ప్రధానమంత్రి
   బి. గవర్నర్
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ. మీరానాయర్
   బి. మంజుల

చుక్కల్లో దాగినదెవరో...!



చిన్నారి చిత్రకారులు



కె. శ్వేత, 3వ తరగతి, అభ్యుదయ హైస్కూల్, హైదరాబాదు.



ఎన్.మేఘన, 2వ తరగతి, సెయింట్ ఆంథోనీ గరల్స్ హైస్కూల్, సికింద్రాబాద్.



బి.ఉదయ్‌ప్రకాష్, 7వతరగతి, ప్రగతి బాల విద్యాలయం, తాడేపల్లి, గుంటూరు.

డి.సూరిబాబు, 10వ తరగతి, ఎస్.వి.ఎస్.పబ్లిక్ స్కూల్, చినకాకాని, గుంటూరు.

అగ్గిపెట్టెతో ప్రయోగం!

హాయ్! ఇవాళ ముందుగా నేనో ప్రశ్న వేస్తాను. అదేంటంటే.... అగ్గిపెట్టను చేత్తో పట్టుకోండి. దాన్ని ఒక బల్లమీద వదలండి. అలా వదిలినప్పుడు కిందపడిన అగ్గిపెట్టె నిలబడాలి. కింద పడిపోకూడదు. ఇలా చెయ్యగలరా? అయితే ఒక బల్ల దగ్గరకు వెళ్లండి. బల్లకు 30 సెంటీమీటర్ల ఎత్తున అగ్గిపెట్టెను నిలువుగా పట్టుకోండి. దాన్ని బల్లమీద అలాగే నిలబడేలా జారవిడవండి. ఏమైంది? నిలబడిందా! లేదా? పక్కకు ఒరిగి పడిపోయిందా? అయితే... నేను చెప్పినట్టు చేయండి. అగ్గిపెట్టెను మూడు సెంటీమీటర్లు తెరవండి. ఎలాగంటే.... బొమ్మలో కనిపిస్తోందే అలాగన్నమాట. ఇప్పుడు జారవిడవండి. ఏమైంది? పక్కకు పడిపోకుండా నిలబడింది కదూ. మరేంటనుకున్నారు! మీ స్నేహితులను కూడా ఇలా చేయమని అడిగి చూడండి. చెయ్యలేకపోతే ఒక ఫోజుపెట్టి తర్వాత చెప్పండే.

మేజిక్! మేజిక్!!

క్విజ్ 75కు జవాబులు

1. 15 2. బాణభట్టు 3. కోపర్నికస్ 4. న్యూటన్ 5. తామర 6. కేరట్ 7. ఆసియా 8. కప్ప 9. జలగ 10. బాలమురళీ కృష్ణ

క్విజ్ 74కు సరైన సమాధానాలు రాసిన వారు :

ఎ.అశోక్, 10వ తరగతి, నవభారతి ఉన్నతపాఠశాల, చొప్పదండి, కరీంనగర్. **పి.కోటేశ్వరరావు**, 8వ తరగతి, **టి.రామారావు**, 10వ తరగతి, **ఎం.ఉమామహేశ్వరరావు**, 9వ తరగతి, కోడూరు, గుంటూరు. **జి.ఉపేంద్ర**, 10వ తరగతి, రాచపూడి, ప్రకాశం. **ఎం.రాఘవరావు**, 10వ తరగతి, చిన్నమండలవీధి, శ్రీకాకుళం. **ఎం.వినాయకరావు**, గవరపాలెం, విశాఖ. **ఎల్.వికాస్**, 6వ తరగతి, దువ్వలి, ప్రకాశం. **డి.పాండురంగారావు**, 7వ తరగతి, త్రిపురాంతకం, ప్రకాశం.

కలం స్నేహం

పేరు: ఎ.వంశీధర్,
వయసు : 13 సం॥
చదువు : 7 వతరగతి
హాబీలు : క్రికెట్ ఆడడం, షెటిల్ ఆడడం.
పూర్తి చిరునామా : ఎ.వంశీధర్, సన్నాఫ్ ఎ. రాజారాం, చొప్పదండి, కరీంనగర్, **505415**

పేరు: మద్దూరి బ్రహ్మయ్య,
వయసు : 15 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు చదవడం, కబడ్డీ ఆడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : మద్దూరి బ్రహ్మయ్య, 9వ తరగతి, జి. హెచ్.స్కూల్, పీఠాపురం, కొండెపి, ప్రకాశం.

కుంటివాని కుయుక్తి

అక్బర్-బీర్బల్ కథలు

ఓసారి పాదుషావారి దగ్గరకు ఒక కుంటివాడు, ఓ రౌతు వచ్చారు. వారితో పాటు ఒక గుర్రం కూడా వుంది. వారిద్దరూ ఆ గుర్రం నాదంటే నాదని వాదించుకున్నారు. పైగా పాదుషావారిని న్యాయం చేయమని కోరారు. ఈ విచిత్రమైన కేసు వినేసరికి పాదుషాకు మతిపోయినంతపనైంది. తన వల్లకాదనుకుని బీర్బల్‌వైపు తిరిగి 'ఈ నిజం ఏమిటో బాగా ఆలోచించి వీరికి న్యాయం చెయ్యి' అని చెప్పారు.

బీర్బల్ వారిద్దరినీ చూసి 'గుర్రాన్ని ఇక్కడ వుంచండి. రేపు తీర్పు చెప్తాను' అని వారిని పంపించాడు. గుర్రాన్ని అశ్వశాలలో కట్టించాడు.

మరునాడు రౌతు, కుంటివాడు వచ్చారు. బీర్బలు వారిని తీసుకుని అశ్వశాలకు వెళ్లాడు. అక్కడ కుంటివాడిని పంపించి 'నీ గుర్రం ఎక్కడ వుందో తెచ్చుకో' అన్నాడు. అతను వెళ్లి అన్ని గుర్రాలతోను తన్నులు తిని వచ్చాడు. అప్పుడు రౌతును పంపించాడు. అతను రెండు నిముషాలలోనే తన గుర్రాన్ని తీసుకుని వచ్చాడు.

బీర్బల్ కుంటివానిని బెదిరించి అసలు విషయం చెప్పమన్నాడు. దాంతో అతను నిజం ఒప్పుకున్నాడు. 'ప్రభూ ఇది ఆయనదే. దురాశతో దీనిని కాజేయాలనుకున్నాను. క్షమించండి' అన్నాడు. బీర్బల్ రౌతుకు గుర్రం ఇప్పించాడు. కుంటివానికి చీవాట్లు పెట్టి పంపివేశాడు.

బీర్బల్ యుక్తితో కుంటివాని కుయుక్తి తెలుసుకున్నందుకు చక్రవర్తి ఆయనను అభినందించాడు.

బుజ్జి కుక్క



మీకు ఈ వారం ఓ చిన్ని కుక్క గురించి చెప్దామనుకుంటున్నా అది ఎంత బుజ్జి కుక్క అంటే... 13 సెంటీమీటర్ల కంటే ఎత్తు పెరగదు. అంత చిన్ని కుక్క. 'అమ్మో! ఇంత బుల్లి కుక్కలు కూడా వుంటాయా?' అనుకుంటున్నారా? చిహువాహువా అనే జాతి కుక్క ప్రపంచంలోకెల్లా అతి చిన్న కుక్క. ఈ జాతి కుక్కలు అర కిలో నుండి రెండున్నర కిలోల బరువుంటాయి. వీటిలో కొన్నిటికి చిన్న వెంట్రుకలు, మరికొన్నిటికి పొడవు వెంట్రుకలు వుంటాయి. ఈ జాతిని మెక్సికోలో అభివృద్ధి చేశారు. మెక్సికోలోని చిహువాహువా అనే రాష్ట్రం పేరు మీద ఈ కుక్కకి నామకరణం జరిగింది. ముద్దులొలికే ఈ బుజ్జి కుక్కను పెంచుకోడానికి చాలామంది ఉత్సాహపడుతుంటారు.

✻ రుక్మిణి

జక్కులోడికో జాబు...

జక్కులోడు గారికి... ఉభయ కుశలోపరి -

గత ఎనిమిదేండ్ల నుండీ మీకు జాబు వ్రాయాలని ఎంతగా ప్రయత్నించినా కుదరలేదు. ఇన్నాళ్ళకి ముడిపడిందని తెలియజేస్కుంటున్నాను.. సంతోషం.. ఈ ఎనిమిదేండ్లలో నిరంతరం మీ గురించే నా దిగులంతా...

ప్రతి జన్మభూమిలో.. ప్ర.వ. పాలనలో మీ రకరకాల సమస్యల మీద మీరంద జేసిన వినతి పత్రములన్నీ కడు భద్రముగా మా కార్యాలయములో కంప్యూటర్లలోకి ఎక్కించి పారేస్తున్నాము. ఇది ఒక నిరంతర ప్రక్రియ. మనిషి కారణజన్ముడు. మీ ఈ సమస్యలు వాటి జన్యువులు. పుదుతూనే వుంటాయి. విధి! వాటి పరిష్కారాన్ని కాలానికే వదిలేయడం విజ్ఞుల లక్షణం. వీటన్నింటికీ కారణంబెవ్వడు. చేసేది నీవు కాదు... నీవు నిమిత్త మాత్రుడవు. (గీతా ప్రవచనములు..)

మన రాష్ట్రం అన్ని రంగాలలో ఈ ప్రపంచంలోని అన్ని దేశాలనూ అధిగమించి ముందుకు దూసుకు పోతుందని మీరు గమనింపవలెను. ఒకసారి తీరిక చేసుకుని మన రాజధాని హైదరాబాదు (సైబరాబాదు)కు వచ్చి తిలకించినచో మన వైభవమంతా కనిపించును. ఆ హైటెక్ సిటీ.. ఆ ఫ్లైఓవర్లూ.. ప్రత్యేకంగా ప్రపంచంలోనే అత్యంత గొప్పదైన ఐమాక్స్ థియేటరు చూసి మన తెలుగుజాతి గౌరవ ప్రతిష్టలకు పొంగిపోయి మీ రెండు జబ్బలను మీరే లపలప చరుచుకోగలరు. వీటన్నిటినీ సాధించుటకు నేను ప్రతిరోజు 18 గంటలు పని చేస్తున్నానని గమనింపగలరు..

ఇంకా కొన్ని రంగములలో మన రాష్ట్రం వెనకబడి ఉన్నదనే గమనింపవలెను. దానికి ప్రత్యేకించి గత యాభై ఏండ్లు పరిపాలించిన దుష్ట కాంగీయే కారణమని గీతాకారుడు ఏనాడో గీతలో ప్రవచించినాడు. అయితే మీ కోసం ప్రత్యేకంగా 'రుణ' సంపాదనకు నేను మిక్కిలి సాధన చేసి తర్ఫీదు పొందిన కారణజన్ముడను - జన్మతః నాకు అబ్బిన ఆ విద్యను ప్రయోగించి మీ అందరి అభివృద్ధికి విశాలమైన రోడ్లు.. పాఠశాలకు సున్నములు వేయించుటకు అరవై వేల కోట్లు అప్పులు సంపాదించితిని. ఈ దేహము అశాశ్వతము.. మానవ జన్మ క్షణ భంగురము.. కానీ ఈ విదేశీ అప్పులు శాశ్వతములు.. ముందు ముందు మీరు మూడు తరముల వరకు చెల్లించినా తరగనంత అప్పు సమకూర్చినందుకు మీరు మిక్కిలి సంతసిల్ల వలయును.

ఎక్కడో త్రయంబకములో పుట్టి అంచెలంచెలుగా పారుతూ మన రాష్ట్రంలో ప్రయాణించుచున్న పుణ్య నదీమతల్లి మన గోదావరి మాత.. మానవులందరూ పాపులే.. అనగా జన్మతః పాపములు చేయుటకు తప్పని సరిగా అలవాటు పడెదరు. (అట్టి 'లంచగొండి' ఉద్యోగులను, విస్తృతముగా దాడులు చేయించి ఉద్యోగముల నుండి ఊడబీకి కటకటాల వెనక్కి నెట్టిన వైనము మీరు ప్రత్యేకముగా గమనించి యుందురు) అట్టి పాపముల వలన మరణము తర్వాత నరక ప్రాప్తి లభించును. నూటడెబ్బై కోట్లు అప్పుసప్పులతో 'తాత్కాలిక' పుష్కరముల ఏర్పాట్లు చేయించినాను గదా! మీరు బుడుంగుమని ఓ మునక వేసిన మీకు డైరెక్టుగా స్వర్గమునకు పాసుపోర్టు లభించే ఏర్పాట్లు చేసితిని. మీరు నిర్మలంగా ప్రకాశించెదరు. తిరిగీ మీరు చేయు పాపములకు ఇప్పటి నుండే కృష్ణానది పుష్కరములకు ప్రభుత్వ యంత్రాంగము మొత్తమును కదిలించుచున్నానని



తెలియజేసుకుంటున్నాను. స్వర్గముకన్నా మీ ఆకలిదప్పులు.. నిరుద్యోగము.. సేద్యపునీరు ఘనమైనవి కాదు గదా! (మనది కర్మభూమియని గమనింపగలరు)

మీ త్రాగునీటి కోసరం దేశంలోని నదులన్నిటినీ అనుసంధానము చేయుటకే అనేక రకముల తికమక ప్రకటనలు చేయవలసి వచ్చుచున్నది. దానికగు పెద్ద మొత్తము ఖర్చును రుణ రూపమున సంపాదించి.. నీటిని టోకున అమ్మకమునకు పెట్టినగాని మీరు బాగుపడరని నాకు తెలుసు. నీళ్ళు అమ్మిన మనకు అపార లాభములు వచ్చును. ఇట్లా అన్నిటినీ అనుసంధానము చేసి మీకు శాశ్వత ఏర్పాట్లు చేయునంత వరకు నేను పదేపదే మీకు సేవ చేసి నేనూ.. మీరూ.. తరించిపోయే భాగ్యము కలిగించ వలసిన బాధ్యత మీదే!

మీ మానసికోల్లాసమూ.. దానితోబాటే భారీ ఉపాధి కల్పన కోసమూ అనేక రకములు మీ కందుబాటులో ఉన్నవి. ఎక్సైజు శాఖవారి అవిరళ కృషి వలన మద్యమును (చవుకగా) మీ అందరికీ అందుబాటులోకి రప్పించి ఆనందపరచుటయే గాక.. మీ మౌళిక సౌకర్యముల కల్పనకోసము ఆదాయమును (ఖజానాకు) విపరీతముగా పెంచు ఏర్పాట్లు ఇందులోని భాగమే! ఇటలీ కంపెనీతో బేరసారములు ముగిసిన తర్వాత ఇక్కడ 'కారురేసు' పందెములు అత్యంత ఘనముగా జరుగుట వలన మీకు మిక్కిలి ఆదాయము లభించును. ఎందుకంటే క్రీడలలో మన రాష్ట్రము ప్రపంచములోనే ముందంజలో ఉన్నది. గ్రామగ్రామానా అఖిలభారత క్రీడా పోటీలు ఏర్పాట్లు చేయు ఆలోచన కలదు.. అసలు పర్మనెంటుగా ఒలింపిక్ క్రీడలను మన సైబరాబాదులోనే ఏర్పాటు చేయుటకు తగు ప్రయత్నములు జరుగుచున్నవి. వీటిలో మీ సకల దరిద్రములు తీరి మీరందరూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్రీడాకారులుగా తీర్చిదిద్దబడుదురు. మీరు నిమిత్తమాత్రులు. నడిపించేవాడు.. రథము తోలువాడు 'వేరే' కలడని గీత బోధించుచున్నది.

కోటి వరాల పథకం మీ కోసమే.. పైన మన 'రథము' తోలువాడు ఈ ఆపత్సమయములో 'పౌరుడికో పథకం' తగిలించమన్నా, మనం తగిలించినా వింత పడాల్సిందేమీ లేదు. స్వర్ణాంధ్ర సాధనకు వ్యతిరేక పవనములు వీచుచున్న ఈ సమయములో పథకములు ప్రకటింపక తప్పదని గమనింప వలయును.

మీ కుటుంబంలోని పిల్లా.. పాపా మరీ ముఖ్యంగా 'మన' ఓటు కలిగిన మీరందరికీ కోటి దండాలు.. మీకోసం కాకున్నా.. మీ పిల్లలు ఎదిగి 'స్వర్ణాంధ్ర' ఏది డాడీ.. ఊఁ అని మారాం చేసినపుడు - వారు కనీసం స్వర్ణాంధ్రలో కాపురం చేయుటకైనా "రథము తోలువాడి" అవసరము ఎంతైనా కలదని గమనింపవలె!

కోర్కెలు బహు కౄరమైనవి. వాటిని మీరందరూ ఆదిలోనే తుంపివేయ వలెను. మీకు కలిగిన దానిలోనే మీరు తృప్తి చెందినచో మీరే దైవ సమానులగుదురు. కలగని దాని గురించి ఆందోళన చెందిన ఆరోగ్య భంగము కలుగును. (గీతా ప్రవచనము) కలో.. గంజో.. దొరికినచో మంచినీరు సేవించి - కడు కమ్మని కోరికల కలలతో - సాధించబోవు స్వర్ణాంధ్రకు నడుము బిగించగలరు. జై స్వర్ణాంధ్రా!

జై జై జన్మభూమి!!

సెలవ్,
భవదీయుడు
స్వర్ణాంధ్ర రథచోదకుడు.

★

వాయిదాల హింస

ఒక మనిషిని ఫినిష్ చేయాలంటే అనేక రకాల పద్ధతులున్నాయి. విషమిచ్చి చంపవచ్చు. కత్తితో పొడిచి చంపవచ్చు. పిస్తోలుతో కాల్చి చంపవచ్చు. దయాదాక్షిణ్యాలు బొత్తిగా లేకపోతే గొంతు పిసికి కూడా పరలోకానికి పంపవచ్చు. చంపడమే ముఖ్యమనుకుంటే క్షణంలో చంపేసి చేతులు దులుపుకునే పద్ధతులు సవాలక్ష వున్నాయి! వదిలేయండి. సినీమాల్లో మాత్రం దీనికి విరుద్ధంగా అఘోరిస్తుంది. మర్డర్ కార్యక్రమం! చప్పన చంపడానికి సినీ సూత్రం మాత్రం చచ్చినా ఒప్పుకోదు. అందుకు చాంతాడంత ప్రొసీజరుంటుంది. బోలెడు గొడవ వుంటుంది. చంపే ప్లేసు ఒకానొక రహస్య స్థావరమై వుంటుంది. అది ఊరికి దూరంగా వుండాలి. ఎంత దూరంగా వుంటే చంపుడు సీను అంత రక్తి కడుతుంది. అక్కడికి కొంత దూరం గుర్రబ్బండి మాట్లాడుకోవాలి. కొంత దూరం సైకిలు మీద వెళ్లాలి. కొంత దూరం కార్లో వెళ్లి... కొంత దూరం పడవ ఎక్కాలి. ఆ తర్వాత కొండెక్కాలి. అక్కడికి చంపవలసిన వాడ్ని ఒక ప్లాను ప్రకారం తీసుకెళ్లాలి!

ఆ తర్వాత చంపే తతంగానికి శ్రీకారం దిద్దాలి! తమ చేతుల్లో చచ్చేవాడ్ని గోడకి అంటిస్తారు. వాడి నెత్తిన ఏపిల్ పండు పెడతారు. ఆ పండును మాత్రమే గురిచూసి కాల్చి ముచ్చట పడతారు. కాల్చిన ప్రతిసారీ వికటాట్టహాసం చేస్తుంటారు! ఆ విధంగా పిస్తోలులో గుళ్లు ఖాళీ అయ్యేంత వరకు వాడి నెత్తిమీద ఆపిల్స్‌ని మాత్రమే కాల్చుతారు. వాడి ఫేసును మాత్రం భద్రంగా వుంచుతారు. ఆ సినిమా చూసే జనాభాకి టెన్షన్ పెరిగే విధంగా ఈ ఏర్పాటు చేస్తారు. సినీమాల్లో చంపే సీనుకి ఇంకో పద్ధతి కూడా వుంది. చంపవలసిన వాడ్ని చెట్టుకొమ్మకి తలకిందులా వేలాడదీస్తారు. కొమ్మకింద మంట పెడతారు. వాడి కాళ్లకి కట్టిన తాడును మెల్లి మెల్లిగా కోస్తుంటారు. ఎంతకీ ఆ తాడు తెగదు. ఇంకోపక్క చావబోతువాడ్ని రక్షించేందుకు కొందరు మనుషులు గుర్రబ్బళ్లు.. సైకిళ్లు.. కార్లూ... పడవలు ఎక్కి కొండని చేరుకుంటారు. అతి కష్టమీద కొండెక్కుతారు. ఈ భాగోతమంతా ఇంటర్‌కట్స్ పద్ధతిలో సాగుతుంది!

చావబోయేవాడు చస్తాడా? చావడా? పెద్ద సస్పెన్సు! చావాలంటే బోలెడు టైం పడుతుంది. ఆ సినీమా చూచేవాళ్లకి నరాలు చిట్లుతుంటాయి. ఉత్కంఠ భరించలేక ఉక్కిరి బిక్కిరవుతూ వుంటారు. పరిధి దాటిపోతే టెన్షన్ భరించలేక పక్కవాళ్లని పచ్చడి చేస్తుంటారు. అది సినీమా! పన్నెండో పధ్నాలుగో రీళ్లు నడవాలి. కథేమో చిన్నది. ఉన్న కథ ఉన్నట్టు తీస్తే ఆరో రీల్లో శుభం కార్డు పడిపోతుంది. అంచేత ఏమిటంటే – ఆ చిన్న కథని లాగి లాగి దుంప తెంచవలసి వుంటుంది. సంభాషణలు రాయలేక చేతులు పడిపోయే ప్రమాదముంది. అంచేత ఆ కష్టం పడలేక ఎంతకీ తెమలని ఫైట్లు పెట్టి నరాలు తెంపుతారు. మంగళం పాడే అవకాశముండి కూడా నిడివి కారణంగా శుభం కార్డుకి రీళ్లకొద్దీ వాయిదా వేస్తుంటారు. జీవితం సినీమా కాదు! అంచేత ఈ తతంగానికి విరుద్ధంగా జీవితం నడుస్తుంది. ఒకడ్ని లేపేయాలంటే దానికి ముహూర్తాలు పెట్టరు. నదులు దాటించరు. కొండలెక్కించరు. క్షణంలో పని ముగించేస్తారు. అంతేగాని ఎర్రీగా చంపి పుణ్యం కట్టుకుంటే మిగతా నిడివి మాటేమిటని బెంగపడరు! వదిలేయండి!

కొన్ని సంసారాలు లాగుడు సీన్లతో నడుస్తుండటం మనం చూస్తూనే వున్నాం. శ్రీవారు కొట్టరు, తిట్టరు. కాకపోతే కట్టుకున్న ఇల్లాల్ని సాధిస్తూ ప్రాణాలు తీస్తారు. మూడు ముళ్లు కట్టిన అర్ధాంగిని ముప్పైమూడు చెరువుల నీళ్లు తాగిస్తూ వేధిస్తుంటారు. ఒకేసారి పీక పిసికి చంపే అవకాశం ఎంతవున్నా వాడుకోరు. ఈ పద్ధతి మీద వాళ్లకు ఇంటరెస్టు లేదు. నిడివి తగ్గిపోతే సినిమా అనిపించుకునే యోగం లేనట్టే. సాధింపులేని సంసారం – సంసారం అని పిలవబడదని మగమారాజుల ఉద్దేశం. అందువల్ల శ్రీమతి సమక్షంలోనే అత్తమామలను దుర్భాషలతో దుమ్మెత్తి పోస్తారు. ఆమె అన్నదమ్ములను ఆడిపోసుకుంటారు. ఊహించిన కట్నం చేతికందలేదని చెరుగుతారు. ఇంటిముందు తిరిగే గజ్జికుక్కకి ఆమె తండ్రిపేరు పెడతారు. ముష్టి వాళ్లను ఇంటికి తెచ్చి మీ అన్నలొచ్చేరని సెటైర్లు కొడతారు. ఆ దిక్కుమాలిన పోలికలకు ఆమె కన్నీరు పెట్టుకుంటే బహు సంతోషిస్తారు!

ఒకేసారి ఆమెను చంపకూడదు. నిత్య సాధింపులతో ప్రతిరోజూ చస్తుండాలి. ఆమె ఆత్మహత్య లాంటివి తలపెట్టకూడదు. అయినా అనుక్షణం ఆమెకు ఆ తలంపే కలిగిస్తుంటారు. తట్టుకోలేక కిరసనాయిలు ఒంటిమీద పోసుకుంటే బరితెగించిన ఆడదని బిరుదునిస్తారు. అఘాయిత్యపు పిల్ల అని వాడకట్టంతా ఆమెను దుమ్మెత్తి పోసేలా కతలనేకం చెబుతారు. ఆ వంశమే అంత అని బంధుమిత్రవర్గం చేత స్టేట్‌మెంట్లిప్పిస్తారు. రేపొద్దున్న ఆమె మళ్ళీ కిరసనాయిలు ప్రయత్నం చేస్తే దానికి మేము బాధ్యులం కామని ఆమె పుట్టించి వారికి వర్తమానాలు పంపుతారు. మక్కీకి మక్కీ ఇదంతా స్టంటు సినీమాల్లో జరిగే తతంగమే! మెడకి తాడుకట్టి వేలాడదీసి కింద అగ్ని గుండం ఏర్పాటు చేసినట్టే గదా? ఇల్లాంటి సంసారాలు చూసే సినీమావాళ్లు తమ కథల్లో వాయిదాల ఫైట్లు పెడుతున్నారని నాకో డవుటు. మొన్న జరిగిన మహిళా సభలో ఈ ముక్కే అన్నాను. ఒక సినీ పెద్దాయన సృష్టిరహస్యాలు చెప్పద్దని కొప్పడ్డారు. చెప్పద్దన్నాడేగాని రాయవద్దని చెప్పలేదు గనక ఈ ప్రయత్నం చేస్తున్నాను.

అవకాశాలున్నా అభివృద్ధి సున్నా

రాయలసీమలోనే ప్రముఖ వాణిజ్య కేంద్రంగా భాసిల్లుతున్న ప్రొద్దుటూరు ప్రాచీన కట్టడాలు, దర్శనీయ స్థలాలతో పర్యాటకులను ఎంతోగానో ఆకర్షిస్తున్నది. అయితే ఇక్కడ పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం కరువు కావడంతో అభివృద్ధికి ఆమడ దూరాన ఉన్నది. రామాయణంలో జరిగిన రామ, రావణ యుద్ధంలో రావణాసురుని వధించిన శ్రీరాముడు రావణబ్రహ్మహత్యా దోషం నుంచి ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి ఇక్కడకు వచ్చి ప్రొద్దుపొడవక ముందే ఇక్కడ సైకత (ఇసుక) లింగాన్ని ప్రతిష్టించినందున ఈ ప్రాంతానికి ప్రొద్దుటూరు అనే పేరు వచ్చిందనీ, శ్రీరాముడు ముక్తిపొందిన ప్రదేశానికి ముక్తి రామేశ్వరమనే పేరు వచ్చిందనే కథ ప్రచారంలో ఉంది.



ప్రొద్దుటూరు పట్టణం పెన్నానది ఒడ్డున గల రామేశ్వరంలో స్వయంగా శ్రీరాముడు ప్రతిష్టించినట్టు చెబుతున్న 56 అంగుళాల సైకత లింగం ఉంది. సైకత లింగానికి అభిముఖంగా కొద్దిదూరంలో కాశీనుంచి హనుమంతుడు తెచ్చి ప్రతిష్టించినట్లుగా చెప్పబడుతున్న మరో శివలింగం కూడా ఉంది. అవే ఈనాడు రామలింగేశ్వర, హనుమత్‌లింగేశ్వర క్షేత్రాలుగా ప్రసిద్ధిచెందాయి. శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన రామలింగేశ్వర ఆలయం ఎత్తైన ప్రాకారాలతో రెండు ద్వారాలు కలిగి, ఐదంతస్తుల గాలిగోపురంతో, ప్రాచీన శిల్పకళా సంపదతో నిండి ఉంది. ఈ ఆలయ ప్రాంగణంలోనే రాజరాజేశ్వరీ ఆలయం, ఆది శంకరాచార్యులు ప్రతిష్టించిన శ్రీచక్రం ఉన్నాయి. ఇక్కడికి సమీపంలోనే బాల్యదశలోనే సజీవ సమాధి అయిన మునిస్వామి ఆలయం ఉన్నాయి.

8వ శతాబ్దిలో తెలుగు చోళరాజుచే నిర్మించబడి, 1498 ప్రాంతంలో విజయనగరరాజులు అభివృద్ధి పరచిన అగస్త్యేశ్వరాలయం (శివాలయం) ప్రొద్దుటూరు నడిబొడ్డులో భక్తుల నీరాజనాలందుకుంటోంది. 120 అడుగుల పొడవు, 140 అడుగుల వెడల్పుతో ఎత్తైన ప్రాకారాలు కలిగి నాలుగు దిక్కులా నాలుగు ద్వారాలు ఉన్నాయి. ఈ ఆలయ ప్రాంగణంలో అగస్త్యేశ్వర, భీమలింగేశ్వర, సుందరేశ్వర, కోదండరామస్వామి, రాజరాజేశ్వరీదేవి ఆలయాలు ఉన్నాయి. సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణచార్యులకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు ఆర్జించి పెట్టిన 'శివతాండవం' కావ్య సృష్టి ఈ ఆలయంలోనే జరిగింది. అగస్త్యేశ్వరాలయంలో వైశాఖశుద్ధ సప్తమి నుంచి పదిరోజులు వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. దసరా సమయంలో రాజరాజేశ్వరీ ఉత్సవ కమిటీ వారు ఇక్కడ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సుమారు 110 సంవత్సరాల నుంచి దసరా ఉత్సవాలను రంగరంగ వైభవంగా నిర్వహిస్తూ, రెండవ మైసూర్‌గా ప్రొద్దుటూరుకు పేరుప్రఖ్యాతులు ఆర్జించిపెట్టిన కన్యకా పరమేశ్వరీ ఆలయం ప్రొద్దుటూరు పట్టణానికే తలమానికంగా భాసిస్తోంది. ప్రొద్దుటూరు అంటేనే కన్యకాపరమేశ్వరీ ఆలయంగా (అమ్మవారిశాల) భక్తులు, ప్రజలచే గుర్తింపు పొందింది. 1890 ప్రాంతంలో నిర్మించినట్టు చెబుతున్న ఈ ఆలయం ఎత్తైన గాలిగోపురం కలిగి, చక్కని శిల్పకళానైపుణ్యంతో విరాజిల్లుతోంది. రాతిస్తంభాలపై తీర్చిదిద్దిన శిల్పాలతో, విజయనగర కాలం నాటి శిల్పకళ ప్రతిబింబిస్తోంది. ఇక్కడ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు దేశవిఖ్యాతి పొందాయి. ఈ ఆలయం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు అన్నదాన సత్రం, ఉచిత ప్రసూతి కేంద్రం, ఆర్యవైశ్య పఠనాలయం నడుస్తున్నాయి. 1929లో జాతిపిత మహాత్మాగాంధీ ఈ ఆలయాన్ని సందర్శించారు. జనమేజయమహారాజుచే ప్రతిష్టించినట్టు చెప్పబడుతున్న చెంద్రాయుని దేవాలయం, అతి అరుదుగా ఉండే ఆత్మారామస్వామి ఆలయం. శ్రీచక్ర, ఆనందనిలయం నమూనాలతో నిర్మించిన శ్రీ లలితాదేవి రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయాలు, పురాతనమైన బొల్లవరం వెంకటేశ్వరాలయం, అత్యంత సుందరంగా ఆధునికంగా నిర్మించిన అయ్యప్పస్వామి, సాయిబాబాస్వామి ఆలయాలు, భక్తులసందడితో నిత్యం సందడిగా కనిపించే దత్తాత్రేయస్వామి, రాఘవేంద్రస్వామి, ఆలయాలు, అన్యాక్రాంతమైన ఆస్థులతో అభివృద్ధికి నోచుకోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయం, దుర్గామాత అంశ కలిగిన చౌడేశ్వరీదేవి ఆలయాలు ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్నాయి. ప్రొద్దుటూరు పట్టణం మెయిన్‌బజార్‌లో వెలిసిన హజ్రత్‌షా హుస్సేన్‌వలీ దర్గా ఇక్కడి హిందూ, ముస్లింల సమైక్యతకు ప్రతీకగా నిలిచింది. ప్రొద్దుటూరు పట్టణానికి సమీపంలోని కలమల్ల గ్రామంలో తొలి తెలుగు శాసనం ఉంది. చారిత్రాత్మక కట్టడం గండికోట, మైలవరం జలాశయం ఇక్కడికి దగ్గరలోనే ఉన్నాయి. ప్రొద్దుటూరుకు అతి సమీపంలోని దానవులపాడు గ్రామం వద్ద పురావస్తు శాఖవారి సంరక్షణలో జైన దేవాయం ఉంది. జలాశయాలు, తోరణాల్లా పచ్చని చోట్ల నడుమ అతి ప్రాచీన పుణ్యక్షేత్రం శ్రీకణ్వతీర్థం కూడా ఇక్కడికి సమీపంలోనే ఉంది. విద్యుత్ వెలుగులను విరజిమ్ముతున్న రాయలసీమ థర్మల్ ప్రాజెక్టు (ఆర్టీపిపి) ప్రొద్దుటూరుకు కేవలం పదికిలోమీటర్ల దూరంలో ఉంది. ★

✻ ఎం.డి. హసన్ షరీఫ్

చరిత్ర సృష్టించిన జార్జ్

అంజూను అభినందిస్తున్న ఆమె భర్త జార్జ్

'వేం పతకం సాధించాలనుకుంటున్నాం. వేం ఫైనల్లో స్థానంతోనే తృప్తి చెందదలచుకోలేదు" అని అంజూ ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించే మూడు రోజుల ముందు బాబీ కోచ్ బాబీ జార్జి అన్నాడు. అతని వాలకం అత్యాశ అనుకున్నా, గర్వం అనుకున్నా బాబీ జార్జ్ ఎల్లప్పుడూ అతిగా ఆలోచించి, అతిగా మాట్లాడతాడు. ఇతర భారత కోచ్‌లందరి కంటే అతను ఎక్కువగా స్పందిస్తాడు. తన భార్యను ప్రోత్సహించడానికి ఇదొక పద్ధతి అని అతను భావిస్తూ ఉండొచ్చు. అంజూ ప్రతిభను, శక్తిని ఆమెకంటే సమర్ధవంతంగా ఆమె భర్త బాబీనే అంచనా వేయగలుగుతాడు. "తిరువనంతపురంలో జూన్ 4, 2001న జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అంజూ పతకం సాధిస్తానని ఆశించింది. అప్పుడు ఆమె 6.74 మీటర్ల దూరం దూకింది" అని బాబీ అన్నాడు. కానీ ఆ ఆశ పారిస్‌లో నెరవేరింది. అంజూ బాబీ జార్జ్ పారిస్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 60 వేల మంది ప్రేక్షకుల ముందు అద్వితీయ ప్రతిభ కనబర్చి కాంస్య పతక విజేతగా నిలిచి చరిత్ర సృష్టించింది. ఈ ప్రతిష్ఠాత్మకమైన టోర్నీలో సీనియర్లతో సహా ఒక్క భారత అథ్లెట్ కూడా ఇప్పటివరకు ఒక్క పతకం కూడా సాధించలేకపోయాడు. కొంతమంది మాత్రం ఫైనల్ వరకూ వెళ్లగలిగారు. అందులో మిల్కాసింగ్, పిటి ఉషలు ఉన్నారు. మిల్కాసింగ్ 1960 రోమ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించి రికార్డు నెలకొల్పే సువర్ణావకాశాన్ని తృటిలో కోల్పోయాడు. 1984 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో ఉష చేసిన కృషి పతకం సాధించేందుకు సరిపోలేదు. చాలామంది భారత అథ్లెట్లు ఏకాగ్రతతో కృషిచేశారు. అయినప్పటికీ లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయ్యారు. కానీ అంజూ ఆగస్టు 30, 2003లో దాన్ని సాధించి భారత్‌కు గర్వకారకురాలైంది. తమ విశేష కృషితో అంజూ, ఆమె భర్త, కోచ్ బాబీ జార్జ్ భారత అథ్లెటిక్స్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించారు. తొలిసారిగా గ్లోబల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న అంజూ క్వాలిఫయింగ్ రౌండ్‌ను అధిగమించడం కూడా చాలా కష్టమని ఆమెతో పాటు భర్త కమ్ కోచ్ బాబీకి, అభిమానులకు తెలుసు. అంజూ ముఖంలో కనబడే టెన్షన్, బాబీ, మైక్ పావెల్, జాకీ జాయనర్ (కోచ్‌లు)లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని తహతహలాడటం ఆమె ఆందోళనలను సూచిస్తున్నాయి. తొలి ప్రయత్నంలో 6.59 మీటర్ల దూరం దూకి ఫరవాలేదనిపించుకుంది. తర్వాతి రెండు ప్రయత్నాల్లో ఫౌల్ అయింది. తర్వాతి ప్రయత్నంలో 6.65 మీటర్ల దూరం దూకి క్వాలిఫయింగ్ మార్క్‌ను అవలీలగా అధిగమించింది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో 12 మంది అథ్లెట్లు పాల్గొనగా మార్క్ అధిగమించిన ఆరో అథ్లెట్ అంజూ. అంజూ ఉత్సాహం చూసి తర్వాతి రౌండ్‌లో సంచలనం సృష్టిస్తుందని అందరూ అంచనా వేశారు. అయితే 'కొటొవా నుండి గట్టిపోటీ ఎదురవుతుందని' ఆరోజు సాయంత్రం అంజూ అభిప్రాయపడింది. స్వదేశీ అభిమానుల ముందు బార్బర్ చెలరేగుతుందని పరిశీలకులు అంచనా వేశారు. అనుకున్నట్లుగానే కొటొవా, బార్బర్‌లు 6.74 మీటర్ల దూరం దూకారు. తనకు పతకం వచ్చే అవకాశం ఉందని అంజూకు ముందే తెలుసు. రెండోరౌండ్‌లో ఆమె మూడో స్థానంలో నిలవగలిగింది. ఫైనల్ రౌండ్ చలి వాతావరణంలో ప్రారంభమైంది. 6.70 మీటర్ల దూరం దూకిన అంజూ తన జాతీయ రికార్డు కంటే నాలుగు సెంటీమీటర్లు తక్కువగా దూరం దూకింది. అయినా ఆమె మూడో స్థానంలో నిలిచింది. ఐదో ప్రయత్నంలో దూరాన్ని అధిగమించిన అంజూ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయింది.

అంజూలో సహజ ప్రతిభ ఉందని గ్రహించిన బాబీ జార్జ్ ఆమెను అభివృద్ధి పర్చాలని కంకణం కట్టుకున్నాడు. ఆమెతో సన్నిహితంగా ఉంటూ సూచనలు ఇవ్వసాగాడు. ఈ సందర్భంలోనే ఇరువురి మనస్సులు కలిసి ఒకటయ్యారు. దీంతో బాబీ కోచ్‌తో పాటు భర్తగా కొత్త బాధ్యతలు కూడా స్వీకరించాడు. అతని విశేష కృషి ఫలితమే అంజూ రూపంలో భారత్‌కు లభించిన ఆణిముత్యం. ఈవెంట్ పూర్తయిన తర్వాత 48 గంటల వరకూ అంజూకు కేంద్ర మంత్రి నుండి కానీ, కేంద్ర ప్రభుత్వ అధికారి నుండి కానీ ఒక్క ఫోన్‌కాల్ రాలేదు. రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాత్రం వ్యక్తిగతంగా అభినందన సందేశం పంపించారు. ఆ మెసేజ్‌ను అంజూ, బాబీ చాలా కాలం గుర్తించుకుంటారు. ఇప్పటికీ ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పతకాన్ని గుర్తించిన వారు ఎంతమంది ఉన్నారో అంచనా వేయడం కష్టం. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో రుమేనియా, నార్వే, ఫిన్‌లాండ్, బల్గేరియా, పోర్చుగల్, నైజీరియా దేశాలు భారత్ కంటే మెరుగైన రికార్డు కలిగి ఉన్నాయి. ఆసియా అథ్లెటిక్స్ సూపర్ పవర్ చైనా ఖాతాలో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించిన రెండు కాంస్య పతకాలు మాత్రమే ఉన్నాయి. దీన్ని బట్టి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పవర్ ఏమిటో అర్ధం చేసుకోగలం. అంజూ హైదరాబాద్‌లో జరిగే ఆఫ్రో-ఆసియా గేమ్స్‌లో, ఏథెన్స్ ఒలింపిక్స్‌లో మరోసారి అద్వితీయ ప్రతిభ కనబర్చి భారత్ ప్రతిష్టను ఇనుమడింప జేస్తుందని ఆశిద్దాం. ★

వ్యక్తిగతం

జననం : 19 ఏప్రిల్, 1977.

స్థలం : కేరళలోని కొత్తయాం జిల్లాలో గల చంగనస్సెరి మండలంలోని చీరంచిర గ్రామం.

ఎత్తు : 1.85 మీటర్లు

బరువు : 62 కిలోలు.

విద్య : ఎకనామిక్స్‌లో బిఎ

ఉద్యోగం : కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌లో, చెన్నయ్

శిక్షణ : సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్, సాయి సౌత్ సెంటర్, బెంగుళూర్.

ఉత్తమ ప్రతిభ : లాంగ్ జంప్-6.74 మీటర్లు (తిరువనంతపురం-2001లో, న్యూఢిల్లీ-2002లో), ట్రిపుల్ జంప్ (13.67 మీటర్లు హైదరాబాద్-2002లో)

పతకాలు : లాంగ్ జంప్-శాఫ్ గేమ్స్‌లో రజతం (ఖాట్మండు-1999), శ్రీలంక ఓపెన్ మీట్‌లో స్వర్ణం (కొలంబో-1999), ఇంటర్నేషనల్ సర్క్యూట్ మీట్‌లో స్వర్ణం (భోపాల్-2000), ఇంటర్నేషనల్ మీట్‌లో కాంస్యం (బాలాటోన్, హంగేరి-2001), ఆసియన్ గ్రాండ్ ప్రీ మీట్‌లో రజతం (హైదరాబాద్-2002), రజతం (మనీలాలో), కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్యం (మాంచెస్టర్-2002), ఆసియన్ గేమ్స్‌లో స్వర్ణం (బుసాన్-2002), సూపర్ గ్రాండ్ ప్రీలో రజతం (స్టాక్‌హోమ్-2003), ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం (పారిస్-2003).

* మొలకలపల్లి కోటేశ్వరరావు

ఎదురు గాలి



"డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ కావాలట నాన్నా! ప్రిన్సిపాల్ రెండు వందల రూపాయలు డబ్బులు తీసుకురమ్మన్నారు" అన్నాడు నరేష్ తండ్రి కృష్ణతో.

"రెండు వందల రూపాయలు ఎందుకూ?" అడిగాడు కృష్ణ ఆశ్చర్యంగా.

"ఎం.ఆర్.ఓ. ఆఫీసులో ఇవ్వాలట. రెండు వందలు ఇస్తేనే వాళ్ళు ఆ సర్టిఫికెట్ ఇస్తున్నారట" చెప్పాడు కొడుకు.

"సరే, నేను వచ్చి మీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడతా కానీ నువ్వు స్కూల్‌కి పద" అని కృష్ణ అప్పటికప్పుడే స్కూల్ దగ్గరకి వెళ్ళాడు.

కృష్ణ కొడుకు నరేష్ ఊళ్ళో వున్న ఓ ప్రైవేట్ స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్నాడు.

కృష్ణ వెళ్ళేటప్పటికి ప్రిన్సిపాల్ తన రూంలో కూర్చుని వున్నాడు. విషయం అడిగాడు కృష్ణ.

'సెవన్త్ క్లాస్ పిల్లలకి డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ కావాలి గదండీ. ప్రైవేట్ క్యాండిడేట్స్‌కి ఇవి కంపల్సరీ. సెవెన్త్‌లో ఈ సర్టిఫికెట్ ఇస్తే ఇక టెన్త్‌లో అవసరం వుండదు. సెవెన్త్ క్లాస్ సర్టిఫికెట్ మీదనే టెన్త్‌కి అప్లికేషన్ పెట్టుకోవచ్చు!" చెప్పారు ప్రిన్సిపాల్.

"నిజమే సార్. రెండువందలు ఎందుకూ?"

"ఎంఆర్ఓ రెండు వందలు ఇస్తేనే సంతకం పెడతారు సార్. ఇప్పుడు కాదు, మేం స్కూల్ పెట్టినప్పటి నుంచీ, ఈ నాలుగేళ్ళ నించీ, ఇది మామూలే! ఎవరైనా డబ్బులు ఇవ్వాల్సిందే! ఇంతకుముందు 150 వుండేది. ఇప్పుడు రెండువందలు చేశారు"

"మనం డబ్బు ఇవ్వకపోతే ఆమె సంతకం పెట్టదా?"

"అనుమానం లేదు. పెట్టదు. చాలా కొర్రీలు పెడుతుంది. ఎంక్వయిరీ చేయాలంటుంది. ఊళ్ళో వున్న విఎఓ ద్వారా అప్లికేషన్ రావాలంటుంది. 15 రోజుల తర్వాత రమ్మంటుంది. ఒకటి కాదు, రకరకాల వంకలు పెడుతుంది. నిరుడు ఇలాగే డాబా వెంకటేశ్వర్లు అధికార పార్టీ మనిషి కదా, తన కూతురికి రెండు వందలు ఇవ్వకుండా సంతకం పెట్టించుకుని వస్తానని ఆఫీసు చుట్టూ మూడు రోజులు తిరిగాడు. చివరికి విసుకుపుట్టి రెండు వందలు సమర్పించుకుని సర్టిఫికెట్ తెచ్చుకున్నాడు. మూడు రోజులు పని మానుకుని వెళ్ళినా సరే, డబ్బులు ఇవ్వనిదే అక్కడ పని కాలేదు!"

"సరే, ఆ ఫారాలు ఏవో ఇవ్వండి. నేను సంతకం పెట్టించుకుని వస్తాను" అన్నాడు క్రిష్ణ

ప్రిన్సిపాల్ తన ఎదురుగా వున్న ర్యాక్‌లో నించి ఫైల్ తీసి, కృష్ణ కొడుకు నరేష్ పేరుతో రాసి వున్న డేటాఫ్ బర్త్ ఫారాలు రెండు ఇచ్చి అన్నాడు. "ఒకటి ఆఫీసుకి వుంచుకుని, ఒకటి మనకి ఇస్తారు. అయినా ఎందుకుసార్, మీకు లేనిపోని రిస్క్? లంచం ఇవ్వనిదే ఆమె సంతకం పెట్టే మనిషి కాదండీ! పోయిన ఏడాది మా స్కూల్ నుంచి 30 మంది సెవెన్త్‌క్లాస్ స్టూడెంట్స్. 30 మందికీ ఆరువేలు ఇచ్చాం. రూపాయి కూడా తగ్గలేదండీ ఆమె. బాకీ మాదిరిగానే తీసుకుంది. వెళ్ళడం, రావడం తప్ప మీకు ఉపయోగం లేదు. ఎలాగూ మేం వెళ్ళక తప్పదు కాబట్టి మేం పెట్టించుకుని వస్తాంలెండి, మీకు ఎందుకు శ్రమ?"

క్రిష్ణ నవ్వి, ఫారాలు తీసుకుని ఇంటికి వచ్చాడు.

తన స్నేహితుడు రాజేష్ వాళ్ళ ఇంటికి వెళ్ళి, అతనిని వెంట పెట్టుకుని ఇద్దరూ మోటార్ సైకిల్ మీద పన్నెండు మైళ్ళ దూరంలో ఉన్న ఎం.ఆర్.ఓ. ఆఫీసుకు వెళ్ళారు.

కృష్ణ డిగ్రీ వరకూ చదువుకున్నాడు. వృత్తి పొలం పని. పొలాలు వున్నాయి. ముక్కుసూటి మనిషి. మొండివాడు. ధైర్య సాహసాలు కూడా కలిగిన వాడు. తప్పు పని అని తను భావిస్తే ఆ పని చేసిన వాళ్ళని ఎవరినైనా నిలదీసే స్వభావం.

వీళ్ళు వెళ్ళేసరికి ఎంఆర్ఓ తన రూంలో కూర్చుని వుంది. బయట వాకిలి దగ్గర బిళ్ళ జవాను స్టూలు మీద కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

కృష్ణ నేరుగా ఎంఆర్ఓ రూంలోనికి వెళ్ళబోతుండగా జవాను అడ్డగించాడు.

"ఏం కావాలి? అడక్కుండా పెట్టకుండా లోపలికి వెళ్ళడమేనా? ఇక్కడమేం కూర్చున్నది ఎందుకూ?" గదమాయించాడు జవాను.

"ఎంఆర్ఓ సంతకం కావాలి"

"ఏం సంతకం?"

"పిల్లవాడికి డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ కావాలి. ఫారం తెచ్చుకున్నాను. దానిమీద ఎంఆర్ఓ సంతకం పెట్టాలి!"

"అయితే లోపలికి వెళ్లడమేనా? ఆ రూంలో ఆర్ఐగారు వుంటారు. ఆయనతో మాట్లాడండి"

రెండు రూముల అవతల వున్న రూంలో ఆర్ఐ కూర్చుని వున్నాడు. కృష్ణ ఆయన దగ్గరకి వెళ్ళి విషయం చెప్పాడు.

"మీ అబ్బాయిది నిజమైన డేటాఫ్ బర్త్ ఇదే అని గ్యారంటీ ఏమిటి? మీ వూళ్ళో పంచాయతీ ఆఫీసులో జనన మరణాల రిజిస్టర్ వుంటుంది. మీవూరి పంచాయతీ

సెక్రటరీ చేత ఈ డేట్‌ని ధృవీకరిస్తూ అప్లికేషన్ ఫారం తీసుకురండి. అది అవసరం!" చెప్పాడు ఆర్ఐ.

"మా వూరికి అసలు పంచాయితీ ఆఫీసే లేదు. ఇప్పుడు బిల్డింగ్ కడుతున్నారు. మా వూళ్ళో అసలు రిజిస్టర్ వుండదు. పొరుగు గ్రామం సెక్రటరీ మా వూరికి కూడా ఇన్‌ఛార్జ్. ఆయన కొత్తగా వచ్చాడు" విషయం చెప్పాడు కృష్ణ

"మరెలా? మీ విఎఓ చేతకానీ, మీ ఇన్‌ఛార్జ సెక్రటరీ చేతకానీ ఇది ఒరిజినల్ డేట్ అని ఒక లెటర్ రాయించుకుని రండి. తరువాత మేం ఎంక్వయిరీ చేసి ఇస్తాం!"

"పిల్లవాడి సర్టిఫికెట్. భూములది కాదూ, రెవెన్యూది కాదూ, మాకు ఆదాయం వచ్చేదీ కాదు, మరొకటీ మరొకటీ కాదు! వాడు ఏడో క్లాసు పరీక్షలకి హాజరవుతున్నాడు. ఇందులో మోసం ఏముంటుందండీ?"

"అవన్నీ మాకు తెలియవండీ. మా రూల్స్ మేం పాటించాలి కదా!" "నిజమే కానీ ఎలాగైనా చేయండి విఎఓ లెటర్ కోసం మళ్లీ మేం వూరికి వెళ్ళడం, రావడం ఇదంతా జరిగే పనికాదు"

"మమ్మల్నేం చేయమంటారు? డూప్లికేట్ డేటాఫ్ బర్త్ ప్రొడ్యూస్ చేస్తున్నారని గవర్నమెంట్ ఈ విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా వుంది. ఏ మాత్రం అది ఒరిజినల్ గాకపోతే మేం చాలా ఇబ్బందులు ఎదుర్కోవాలి!" అని ఆర్ఐ తన పనిలో పడిపోయాడు.

వీళ్ళవైపు తల ఎత్తి చూడలేదు. వచ్చిన వాళ్ళు తిరిగి అంతతేలికగా వెళ్ళరని ఆయనకి తెలుసు.

"ఏం చేయమంటారండీ?" కొద్దిసేపు తరువాత నసుగుతూ అన్నాడు కృష్ణ

"మీరే చెప్పండి"

"ఎలాగోలా సంతకం పెట్టించండి. దూరం నుంచి వచ్చాం"

"ఇలాంటి విషయాలకు అసలు ఒప్పుకోరండీ అమ్మగారు. నా మీద కోప్పడతారు. సరే, అమ్మగారికి ఎలాగో నచ్చచెప్పి కన్విన్స్ చేస్తాను కానీ డబ్బు తెచ్చారా?"

"ఎంతండీ?"

"మామూలే. రెండొందలు"

"రెండు వందలు ఇస్తే మళ్ళీ రేపు రమ్మనకుండా ఇవ్వాళే ఇస్తారా? రేపు మాకు వేరే పని వుంది"

"రేపు ఎందుకూ, ఇవ్వాళే ఇస్తాం. రెండు వందలు ఇవ్వండి ముందు!"

కృష్ణ జేబులో చేయిపెట్టి చూసాడు. ఖాళీ జేబే!

"అరే... డబ్బు తీసుకురాలేదండీ! డబ్బు రేపు ఇస్తాం కానీ ఇప్పుడు సంతకం పెట్టించుకురండి"

ఆర్ఐకి కోపం నషాళానికి అంటింది.

"ఏం తమాషా చేస్తున్నారా? వేషాలు వేస్తున్నారు"

"మేం కాదు, మీరు వేషాలు వేస్తున్నారు. మీరు తమాషా చేస్తున్నారు"

"ఏమంటున్నారు మీరు?"

"మీరేం అంటున్నారు?"

ఆర్ఐకి తన సర్వీస్‌లో ఎప్పుడూ ఇలాంటి కేసు తగల్లేదు. వీళ్ళు ఎదురు దాడికి దిగడంతో కోపాన్ని కంట్రోల్ చేసుకున్నాడు.

"సర్లే ఇక పదండి. మాకు పనేం లేదనుకుంటున్నారా?"

"అవును. ఏం పనుంది? లంచాలు తీసుకోవడమేగా!"

ఎవరూ మాట్లాడలేదు. కొద్దిసేపు నిశ్శబ్దం అలుముకుంది.

"ఇక మీరు బయటికి వెళ్తారా" చాలాసేపటి తరువాత ఆర్ఐ అన్నాడు.

"కొద్దిగా ఎంఆర్ఓ చేత మాకు సంతకం పెట్టించండీ!" చిన్నస్వరంతో వినయంగా అన్నాడు కృష్ణ ఒక్క ఉదుటున ఆర్ఐ లేచి వడివడిగా ఎంఆర్ఓ రూంలోకి వెళ్ళాడు.

వీళ్ళూ గదిలో నుంచి బయటికి వచ్చారు.

ఎంఆర్ఓ గదికి ఎదురుగా పెద్దకానుగ చెట్టు వుంది. ఎండ ఎక్కువగా వుండటంతో చెట్టు చల్లటి నీడ ఇస్తోంది.

ఇద్దరూ చెట్టు నీడకు వెళ్ళారు.

అదే ప్రాంగణంలో ఎండిఓ ఆఫీసూ, ఎంఇఓ ఆఫీసూ, ఎంపిపీ ఆఫీసూ వున్నాయి.

పట్టాదార్ పాసు పుస్తకాల కోసం వచ్చిన వాళ్ళూ, ఇన్‌కమ్ సర్టిఫికెట్స్ కోసం వచ్చిన వాళ్ళూ, ప్రభుత్వం కట్టిస్తున్న పేదల ఇళ్లకు సిమెంటు, ఇనుము కోసం వచ్చిన వాళ్లూ దూరంగా మరో చెట్టు కింద నిలబడి వున్నారు. సాయంత్రానికి కానీ వాళ్ళకి మోక్షం లభించదు.

అక్కడే ఒకావిడ ఒక గిన్నెలో గారెలు, బజ్జీలూ, ఒకప్లాస్క్‌లో టీనీళ్లూ పోసుకుని అమ్ముకుంటోంది.

"చిన్న పిల్లల బర్త్ సర్టిఫికెట్ కోసం రెండవందలు లంచం ఇవ్వాలా? లంచం ఇవ్వకపోతే సర్టిఫికెట్ ఇవ్వరన్నమాట! ఈ విషయం ముందే తెలిస్తే ఏసీబీ వాళ్ళకి రిపోర్ట్ చేసి లంచం అడిగిన వాళ్ళని కటకటాల వెనక్కి పంపించి వుండేవాడ్ని. ఇలా లంచం అడుగుతారని ముందే తెలుసుకోకపోవటం నా తప్పు! నాకు కొద్దిగా తెలిసినా ఇవ్వాళ వీళ్ళకి మూడేదే!" అన్నాడు కృష్ణ పెద్దగా.

కృష్ణ మాటలకు ఎదురుగా వున్న బిళ్ళ జవాను నోరు తెరిచాడు.

"ఇప్పుడైనా రిపోర్ట్ చేస్తే?" అన్నాడు కృష్ణ స్నేహితుడు రాజేష్.

"ఏం వుపయోగం? లంచం తీసుకోవడం కాదు, ఇవ్వడం కూడా నేరమే! వీళ్ళ కోసం మనం నేరం చేసి నేరస్తులం కావాలన్న మాట! మన మండలంలో ప్రైవేటుగా 7వ తరగతి చదువుతున్న పిల్లలు 15 వందల మంది వున్నారు. ఒక్కొక్కరి దగ్గర రెండు వందల లెక్కల 15 వందల మంది మీదా చూడు ఎంత అవుతుందో! మూడు లక్షలు! పసి పిల్లల దగ్గర మూడు లక్షలు కొట్టేసి వాళ్ళు ఇక పెద్ద పెద్ద భూములకు సంబంధించీ, ప్రాపర్టీలోనూ, పట్టాదార్ పాస్ పుస్తకాల్లోనూ ఇంకా ఎన్ని లక్షలు కొట్టేస్తున్నారో! వీళ్ళ అవినీతికి అంతూ పొంతూ లేదు. నరమాంసం రుచి మరిగిన పులి ఇక మనిషి కనబడితే వదిలి పెట్టదట. వీళ్ళూ లంచాల రుచి మరిగి ప్రతి చిన్న పనికీ, పెద్ద పనికీ లంచాలు దండుకుంటున్నారు!" పెద్ద కంఠంతో అన్నాడు కృష్ణ

"నువ్వు మాట్లాడేది ఏంటయ్యా?" బిళ్ళ జవాను కోపంగా అన్నాడు.

"నేను మాట్లాడేది ఏమిటా? నన్ను ఎంఆర్ఓ గారి రూంలోనికి అయినా పంపించు లేదా ఎంఆర్ఓ గార్ని బయటికి అయినా రమ్మని చెప్పు. నన్ను మీ ఆర్ఐ రెండువందలు లంచం అడిగాడు. నేను ఈ విషయాన్ని ఇంతటితో వదిలి పెడతాననుకుంటున్నారేమో! కలెక్టర్‌కీ, ఏసీబీ ఎస్పీకీ అందరికీ రిపోర్ట్ చేస్తాను. సీఎమ్‌కి లెటర్ పెడతాను. అసలు లంచం అడగడమేమిటి? గవర్నమెంట్ మీకు జీతాలు ఇవ్వడం లేదా? జీతాలు చాలకపోతే ఎక్కువ ఇవ్వమని పోరాడండి. అది చేతగాకపోతే రోడ్డు పక్కన గిన్నె పెట్టుకుని అమ్మా అయ్యా దానం చేయమని అడుక్కుతినండి. శవాల మీద చిల్లర ఏరుకునే వెధవలు... ముష్టివెధవలు... రెండు వందలంటే మాటలా? ఒక మనిషి పొద్దుట్నించీ సాయంత్రం వరకూ నడుములు విరగ్గొట్టుకుని పని చేస్తే ఇచ్చే కూలి 50 రూపాయలు. మీకు వూరికే సంతకం పెట్టినందుకు రెండు వందలు ఇవ్వాలా? విషయం ఏమిటో తేలుస్తాను!" పెద్దగా గాండ్రిస్తున్నట్లే అన్నాడు కృష్ణ

దూరంగా చెట్టు క్రింద వున్న వాళ్ళు అరుపులు విని కృష్ణ దగ్గరకు ఒక్కొక్కరూ రాసాగారు. గుంపు పెరుగుతోంది.

"దేశంలో అవినీతి అంటు జాడ్యంలా పెరిగిపోతోంది. ఆ మధ్య ఎప్పుడో పేపర్లో చదివాను. చైనాలో ఇలానే ఇద్దరు లంచగొండి అధికారుల్ని వురి

(మిగతా 23వ పేజీలో...)

"ఏం వుపయోగం? లంచం తీసుకోవడం కాదు, ఇవ్వడం కూడా నేరమే! వీళ్ళ కోసం మనం నేరం చేసి నేరస్తులం కావాలన్న మాట! మన మండలంలో ప్రైవేటుగా 7వ తరగతి చదువుతున్న పిల్లలు 15 వందల మంది వున్నారు. ఒక్కొక్కరి దగ్గర రెండు వందల లెక్కల 15 వందల మంది మీదా చూడు ఎంత అవుతుందో! మూడు లక్షలు! పసి పిల్లల దగ్గర మూడు లక్షలు కొట్టేసి వాళ్ళు ఇక పెద్ద పెద్ద భూములకు సంబంధించీ, ప్రాపర్టీలోనూ, పట్టాదార్ పాస్ పుస్తకాల్లోనూ ఇంకా ఎన్ని లక్షలు కొట్టేస్తున్నారో! వీళ్ళ అవినీతికి అంతూ పొంతూ లేదు. నరమాంసం రుచి మరిగిన పులి ఇక మనిషి కనబడితే వదిలి పెట్టదట. వీళ్ళూ లంచాల రుచి మరిగి ప్రతి చిన్న పనికీ, పెద్ద పనికీ లంచాలు దండుకుంటున్నారు!" పెద్ద కంఠంతో అన్నాడు కృష్ణ.

* విజయరావు

తెలుగులో తొలిసారి ప్లేటో రచనలు

సుప్రసిద్ధ ప్రాచీన గ్రీకు తత్వవేత్త ప్లేటో. ఆయన క్రీస్తు పూర్వం ఐదవ శతాబ్దానికి చెందిన వాడు. ఆనాటి ప్రపంచంలో గ్రీసు దేశం అత్యున్నత దశలో ఉండేది. శాస్త్ర విజ్ఞానం, కళలు, సంస్కృతి ఉచ్ఛస్థితిలో ఉండేవి. తత్వశాస్త్రం కూడా ఈ అంశాలను ప్రతిబింబించింది. హెరాక్లిటస్, డెమోక్రిటస్ లాంటి వారి సిద్ధాంతాలు శాస్త్రవిజ్ఞానం అభివృద్ధికి దోహదపడ్డాయి. తత్వశాస్త్ర చరిత్రలో ప్లేటో ఒక మైలురాయి వంటి వాడు. అప్పటివరకు మానవజాతి వివిధ రంగాలలో సాధించిన విజ్ఞానాన్ని ప్లేటో తన తాత్విక రచనల్లో క్రోడీకరించాడు. ఆయన శైలి ఎంతో అద్భుతమైనది. సంభాషణల రూపంలో ఉండే ఆయన రచనలు సాహిత్య విలువలతో, కళాత్మకంగా, సులభ గ్రాహ్యంగా సాగుతాయి. ఆయన విషయాన్ని ఎంతో మనోహరంగా వివరిస్తాడు. మంత్రముగ్ధులను చేసే ఆయన శైలి ఎదుటివారిని తేలిగ్గా ఒప్పిస్తుంది. అందువల్లనే తత్వశాస్త్ర చరిత్రలో ప్లేటో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. అలాంటి ప్లేటో రచనలను తొలిసారిగా తెలుగు పాఠకులు చదివే అవకాశాన్ని పీకాక్ క్లాసిక్స్ ప్రచురణ సంస్థ వారు కలిగించారు.

ప్లేటో ప్రధాన రచన రిపబ్లిక్. దాన్ని తర్వాత అందిస్తామని ప్రచురణ కర్తలు తెలిపారు. ప్రస్తుత గ్రంథంలో ప్లేటో ఐదు రచనలున్నాయి. అవి సోక్రటిస్ ఆత్మరక్షణ, క్రిటో, ఫేడో, అయోన్, మెనో లు. ఇవన్నీ సోక్రటిస్ న్యాయస్థానంలో చేసిన వాదనలు, మరణ శిక్షను అనుభవించడానికి ముందు జైలులో ఆయన తన సన్నిహితులతో జరిపిన సంభాషణలు. సోక్రటిస్ శిష్యుడైన ప్లేటో వాటిని గ్రంథస్తం చేశాడు. స్వయంగా ఏ రచనలు చేయని సోక్రటిస్ అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఇవే ఆధారం. గురువంటే ప్లేటోకు వల్లమాలిన అభిమానం. అయినప్పటికీ సోక్రటిస్ చెప్పినట్లు ప్లేటో పేర్కొన్న విషయాలలో సోక్రటిస్ అభిప్రాయాలేవి, ప్లేటో జోడించినవేవి అన్న అంశంపై వివాదం ఇప్పటికీ కొనసాగుతున్నది. సోక్రటిస్ సంప్రదాయాన్నే ప్లేటో అనుసరించాడు కాబట్టి దీని గురించి పెద్దగా పట్టించుకోవలసిన పని లేదు.

ప్లేటోను మానవజాతి చరిత్రలోనే అత్యంత మేధావంతుల్లో ఒకరిగా పరిగణిస్తారు. అయినా ప్లేటో పరిమితులను కూడ అర్థం చేసుకుంటే తప్ప ఆయన గురించి కచ్చితమైన అంచనాకు రాలేము. ప్లేటో తాత్విక పరిజ్ఞానం భావవాద సంప్రదాయానికి చెందింది. పదార్థం కాదు భావమే ప్రధానం అన్నది ఆయన వాదన. ఆనాడు గ్రీసులో బానిస వ్యవస్థ అత్యున్నత స్థాయికి చేరింది. అప్పటికి సాధించిన విజ్ఞానానికంతటికీ పునాది బానిసల శ్రమ మాత్రమే. ఆ బానిసల శ్రమ ప్రాధాన్యతను సోక్రటిస్, ప్లేటో లాంటి భావవాదులెవ్వరూ గుర్తించ లేదు.



ఐదు సుప్రసిద్ధ ప్లేటో రచనలు
తెలుగు: ఎ గాంధి; **ధర:** రు.100
ప్రచురణ: పీకాక్ క్లాసిక్స్, హైదరాబాద్
ప్రతులకు: ప్రజాశక్తి, విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు

గొప్పగా చెప్పుకునే గ్రీకు డెమోక్రసీ బానిసలకు వర్తించదు. బానిసలను తోటి మనుషులుగా సైతం ఈ తరహా తత్వవేత్తలు గుర్తించలేదు. పైపెచ్చు ఆ అమానుషమైన బానిస వ్యవస్థను పరిరక్షించడానికే వారు తమ వాదనలను వినియోగించారు. జైలు నుండి పారిపొమ్మని క్రిటో చేసిన ప్రతిపాదనను తిరస్కరిస్తూ సోక్రటిస్ చెప్పిన మాటలు దీనికి తిరుగులేని ఉదాహరణ. 'వ్యక్తులు ఎవరికి వారే చట్టాలను చట్టుబండలు చేసి, వాటి అధికారాలను కాలరాస్తే రాజ్యాంగ యంత్రం మనగలుగుతుందా? కూలిపోదా? ఇటువంటి ప్రశ్నలకు నేనేమి సమాధానం చెప్పగలుగుతాను.' అని సోక్రటిస్ చెబుతాడు. తనపై తప్పుడు ఆరోపణలు చేయబడ్డాయని తెలిసీ ఆ రాజ్యాంగ యంత్రానికే కట్టుబడాలనుకుంటాడు. సోక్రటిస్ ఆలోచనలు మతస్థాయి నుండి తత్వశాస్త్రం వైపుకు పయనించే క్రమాన్ని ఈ రచనల్లో మనం చూస్తాము. సోక్రటిస్‌కు తత్వశాస్త్రమంటే పిడిసూత్రాలు కావు. ఉన్నతమైన, నీతిమంతమైన జీవితాన్ని గడపడమే ఆయన దృష్టిలో తత్వశాస్త్రం. 'న్యాయం వల్ల పెరిగేది, అన్యాయం వల్ల తరిగేది సత్యం. శరీరం కంటే సత్యం ఉన్నతమైనది.' అనే ఆయన మాటలు దీన్నే స్పష్టం చేస్తున్నాయి.

సోక్రటిస్, ప్లేటో, ఆ తర్వాత అరిస్టాటిల్ లాంటి తత్వవేత్తలు స్వీయాత్మక భావవాదుల్లాగా వ్యక్తుల భావాలే పదార్థాన్ని నేరుగా సృష్టిస్తాయని చెప్పలేదు. వీరు వస్తుగత భావవాదులు. ఉదాహరణకు వడ్రంగి ఓ మంచం తయారుచేశాడంటే దాన్ని ఎలా తయారు చెయ్యాలన్న భావనను భగవంతుడు అతని మనసులో ప్రవేశపెడతాడు, దాని ఆధారంగానే వడ్రంగి మంచాన్ని తయారు చేస్తాడు అని వీరు చెబుతారు. దీనిలో వీరి భావవాదమే కాకుండా శారీరక శ్రమ పట్ల చులకన కూడా వెల్లడవుతున్నది. చావు పుట్టుకలు శరీరానికే తప్ప ఆత్మకు కాదని వీరి విశ్వాసం. ఈ విశ్వాసంతోనే సోక్రటిస్ 'ఈ లోకం నుండి నా ప్రయాణాన్ని సుఖంగా జరిగేలా చూడమని దేవతలను ప్రార్థిస్తున్నాను.' అంటూ విషాన్ని సంతోషంగా అవలీలగా తాగేశాడు. ఇంద్రియాల ద్వారా భౌతిక ప్రపంచాన్ని అర్థం చేసుకోగలం తప్ప అంతిమ సత్యాన్ని తెలుసుకోజాలమని వీరు చెబుతారు. ఇంద్రియ జ్ఞానాన్ని ఈ పరిమితుల్లోనయినా గుర్తించాడు కాబట్టే ప్లేటో భావవాద పరిధి లోపలే గతితర్కాన్ని స్పృశించ గలిగాడు. అరిస్టాటిల్ శాస్త్ర విజ్ఞానంలో భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం లాంటి విభాగాలను గుర్తించ గలిగాడు.

ఈ విధమైన నేపథ్యాన్ని మరింత లోతుగా తెలుసుకుంటే తప్ప ఈ గ్రీకు తత్వవేత్తలను సక్రమమైన రీతిలో అర్థం చేసుకోలేం. అటువంటి సవివరమైన పరిచయాన్ని ప్లేటో రచనల ఈ తెలుగు ప్రతికి జోడిస్తే ఎంతో ఉపయోగంగా ఉండేది. లోక్‌సత్తా నాయకులు జయప్రకాష్ నారాయణ్ రాసిన ముందుమాట ఈ అవసరానికి అనువుగా లేదు. ఈ తత్వవేత్తల భావవాదాన్ని , దానినుండి వచ్చిన వాదనలను కీర్తించేదిగా మాత్రమే ఉంది. 'ప్లేటో భావవ్యక్తీకరణ సౌందర్యం ఆయన భావనల్లోని అస్తవ్యస్తతను అర్థం చేసుకోకుండా అడ్డుపడింది.' అని సైన్స్ ఇన్ హిస్టరీ గ్రంథంలో జె డి బెర్నాల్ చెబుతారు. ప్లేటో భావాలను యథాతథంగా స్వీకరిస్తే అవి శాస్త్ర ప్రగతికి ఎంత మాత్రం దోహదపడవన్నది ఆయన ఉద్దేశం. ఈ విషయాన్ని మనమూ గమనంలో ఉంచుకోక పోతే పప్పులో కాలేస్తాం. ఏదేమయినప్పటికీ తత్వశాస్త్ర చరిత్రలో ప్లేటో రచనలకు సుస్థిరమైన స్థానముంది. రాజకీయ ప్రాధాన్యత ఉంది.

గాంధీ గారి తెలుగు అనువాదం సరళంగా, సులభ గ్రాహ్యంగా, సుందరంగా ఉంది. అయితే ఈ అనువాదానికి మూలం గురించి తెలియచేయలేదు. చెబితే బావుండేది. ఇలాంటి ప్రామాణిక రచనను తెలుగు పాఠకులకు అందించినందుకు మనఃపూర్వక అభినందనలు. ●

✻ లాస్యప్రియ

సమకాలీన పరిస్థితుల్ని దృశ్యబద్ధం చేసిన 'అక్కినేని' నాటికలు

సాధారణంగా పరిషత్తు నాటకాలపై నాటక ప్రియులకు ఒకింత ఆసక్తి ఉండటం సహజం. మునుపెన్నడూ ఏ వేదికపై ప్రదర్శించని నాటకాల్ని చూడవచ్చుననే ఉత్సాహం ఒకటికాగా, నాటకాలన్నీ నూతన కథావస్తువుతో రూపొందుతాయనే కారణం మరొకటి. ఈ నేపథ్యంలో పేరొందిన కళాపరిషత్ నాటక పోటీలపట్ల ఇటీవల కాలంలో ప్రేక్షకాదరణ బాగా పెరుగుతోంది. ఇలాంటి నాటక పరిషత్‌ల జాబితాల్లో ముందువరసలోనున్న 'అక్కినేని నాటక కళాపరిషత్' పోటీలు ఈ ఏడాదితో తొమ్మిది వసంతాలు విజయవంతంగా పూర్తిచేసుకున్నాయి. ఈ ఏడాది **2003** సంవత్సరానికి గాను పరిషత్ నిర్వహించిన పోటీ నాటికల్లో పలు ప్రదర్శనలు సమకాలీన పరిస్థితులకు అద్దంపట్టాయి. అటు వినోదం, ఇటు సందేశంతో కూడిన కథనాలతో మెప్పు పొందిన ఈ నాటికల్ని పరిశీలిస్తే సామాజిక సమస్యగా పరిగణించే 'ఎయిడ్స్ మహమ్మారి', 'మద్యపానంవల్ల కలిగే అనర్థాలు, వర్తమాన నీటి తగాదాలు, భారత్, పాక్‌ల మధ్య నెలకొన్న వైషమ్యం ఇలా పలు సమస్యల్ని ఈ నాటికల్లో చూపారు.

విజేతగా నిలిచిన 'నమోనమః'

రైతును మించిన సౌభాగ్యం ఉండదనే సత్యాన్ని చక్కని మెలోడ్రామాతో చూపించిన 'నమోనమః' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎన్నికయ్యింది. నాటకరంగంనుండి సినిమారంగానికి ఎదిగిన కథ, మాటల రచయిత దివాకర్‌బాబు రచించిన ఈ నాటికను జరుగుల రామారావు దర్శకత్వంలో ప్రదర్శించారు. అటు న్యాయనిర్ణేతల్ని, ఇటు ప్రేక్షకుల్ని ఏకగ్రీవంగా ఒప్పించిన ఈ నాటికలో పలు విశేషాలు విమర్శకులను సైతం ఆకర్షించాయి. అయిదు పాత్రలతో నడిచిన ఈ ప్రదర్శనలో రంగాలంకరణ, సహజత్వానికి దగ్గరగా సంభాషణలు, ముక్కుసూటి కథనం, కథావస్తువులో ఆధునికత వెరసి ప్రేక్షకులకు ఆనందాన్ని పంచింది. క్లుప్తంగా కథలోకి వెళితే.. అర్ధరాత్రి. దట్టమైన అడవిలో విమానం కూలుతుంది. ప్రమాదంనుంచి బయటపడ్డ నలుగురు అపరిచిత వ్యక్తులు ఒకచోటకు చేరుకుంటారు. వారిలో ధనవంతుడు, సైంటిస్టు, కళాకారుడు, అందాలపోటీల్లో పాల్గొనబోయే యువతి ఉంటారు. వేరువేరు రంగాల్లో నిష్ణాతులైన



ముగ్గురినీ పెళ్లి చేసుకోవడానికి ఆ యువతి అంగీకరిస్తుంది. ఇంతలో ఆమెకు ఆకలి వేస్తుంది. ముగ్గురు యువకులూ ఆమె ఆకల్ని తీర్చలేక మౌనం వహిస్తారు. తెల్లారిన తర్వాత ఆ దారిన వచ్చిన రైతన్న తను తెచ్చుకున్న సద్ది బువ్వను ఆయువతితోపాటు అందరికీ పంచుతాడు. ప్రపంచానికి తిండిపెట్టే రైతు కంటే మిన్న మరొకటి ఉండదని ఆ యువతి గ్రహిస్తుంది. రైతును మాత్రమే పెళ్లాడతానని ఆ యువతి రైతన్నతో నమోనమః అనడంతో కథ ముగుస్తుంది. రెండవ ప్రదర్శనగా గంగోత్రి పెద కాకాని వారి సమర్పణలో 'ప్రేమా తురాణం' నాటిక ప్రేమ ఉచ్చులోపడి జీవితాల్ని నాశనం చేసుకుంటున్న యువతీ యువకుల పరిస్థితికి అద్దం పట్టింది. చక్కని పాత్రలు, అవసరమేరకు సెట్టింగులు, సమకాలీన కథనం , అలాగే సుదీర్ఘానుభవంగల నటవర్గం ఈ ప్రదర్శనకు అదనపు ఆకర్షణ చేకూర్చాయి. ఇదే నాటికనుండి దర్శకత్వంతోపాటు ముఖ్యపాత్ర ధరించిన నాయుడు గోపి ఉత్తమనటునిగా, ఉత్తమ రచయితగా వల్లూరు శివప్రసాద్, గంగోత్రి సాయి ఉత్తమ హాస్యనటునిగా ఎన్నిక కావడం విశేషం. అలాగే మిగతా ప్రదర్శనలైన కళావర్షిణి (హైదరాబాద్) వారి 'భూమిక', సాంస్కృతిక సమాఖ్య (విజయవాడ) వారి 'హెచ్చరిక', కోడూరు కళాసమితి (రైల్వే కోడూరు)వారి 'అణుబంధం', ఉమాఆర్ట్స్ (కాకినాడ) వారి 'పంచభర్తృక', శిరీష ఆర్ట్స్ (వైజాగ్) వారి 'నీరు', మహానటి సావిత్రి కళాపరిషత్ (కొత్తపట్నం) వారి 'రేపటి మనిషి', రసఝరి (పొన్నూరు) వారి 'అమృతం ఇంకావుంది' నాటికలు నాణ్యతా ప్రమాణాలు కలిగిన ప్రదర్శనలుగా ప్రేక్షకులను అకట్టుకున్నాయి. సెప్టెంబరు 21, 22, 23 తేదీలలో హైదరాబాద్ రవీంద్రభారతి వేదికపై మూడురోజులపాటు జరిగిన ఈ నాటకోత్సవాలకు యువకళావాహిని వై.కె. నాగేశ్వరరావు కన్వీనర్‌గా, న్యాయనిర్ణేతలుగా బి.వేదయ్య, సి.రాజశేఖర్, కె.ధర్మారావు వ్యవహరించారు. జి.వి.జి.శంకర్, వై.మల్లిఖార్జునరావు, బుజ్జి తదితరులు కార్యక్రమ నిర్వాహణలో ముఖ్యభూమికను పోషించారు. పలు నాటక పరిషత్‌లకు కేంద్రబిందువవుతున్న హైదరాబాద్ నగరంలో గత తొమ్మిదేళ్లుగా నాటకాభిమానుల ఆదరణ పొందుతూ మరెన్నో కొత్త నాటకాలకు ప్రాణం పోస్తున్న 'అక్కినేని నాటక కళాపరిషత్' కృషి ప్రశంసనీయం. ★



ఉత్తమ సహాయనటి హేమ, ఉత్తమ సహాయనటుడు సి.ఎం.మూర్తి

అక్కినేనిపై అభిమానమే పరిషత్‌ను నడిపిస్తుంది!

అక్కినేనిపై గల అపారమైన అభిమానమే తొమ్మిదేళ్ల క్రితం నాచేత ఈ నాటక పరిషత్‌ను స్థాపింపజేసింది. గత తొమ్మిదేళ్లుగా వందలాది మంది కళాకారులు ఈ నాటక పరిషత్‌నుండి పరిచయమై పరిపూర్ణమైన నటులుగా ఎదిగారు. మరెన్నో కొత్త నాటకాలు ఉద్భవించాయి. తెలుగు సినీరంగానికి చెందిన అక్కినేనిలాంటి మహానటుని పేరిట కళామతల్లికి సేవలందించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. జాతీయ నాటకస్థాయికి ఈ పరిషత్‌ను తీసుకువెళ్లాలనే సంకల్పంవుంది. దీనికి అందరి సహకారం అవసరం. ముఖ్యంగా కళాకారుల సహకారం కావాలి.

లాంకో గ్రూప్ అధినేత, డాక్టర్ అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండలరావు

* పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

అమ్మ ముసుగులో మోసగాడు

"తన కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.. ఇకపై కుటుంబమంతా ఆనందోత్సాహాలతో ఉండవచ్చు" మనసులో అనుకున్నాడు చందోలు సత్యనారాయణ.

చేతిలో ఉత్తరం రెపరెపలాడింది.

ఎంతోమంది కోర్కెలను తీర్చిన అమ్మ తనను కరుణించడం అతనికి సంతోషాన్ని కలిగించింది. గుంటూరు జిల్లా అమరావతికి చెందిన సత్యనారాయణ ఉద్వేగాన్ని ఆపుకో లేకపోయాడు.

దైవాంశ సంభూతురాలైన అమ్మ కొందరినే అనుగ్రహిస్తుంది. వారికే వరాలను ప్రసాదిస్తుంది. తన కష్టాలను చెప్పుకోగానే చిరునామా తీసుకుంది. ఆ ప్రకారం తనకు ఉత్తరం చేరింది.

గుంటూరు ప్రయాణం నిర్ణయమైంది.

'అమరావతిలో బస్సు ఎక్కితే ఒకటిన్నర, రెండు గంటల్లో గుంటూరు చేరవచ్చు' అనుకున్నాడు సత్యనారాయణ.

బట్టలను సర్దుకున్నాడు. అమ్మవారికి సమర్పించడానికి కానుకలు, ముడుపులు సిద్ధం చేసుకున్నాడు. తర్వాత బస్సు ఎక్కాడు.

గుంటూరు అశోక్‌నగర్‌లో అమ్మ అపార్టుమెంటుకు చేరేసరికి ఉదయం పదకొండు గంటలు అయింది. ఎదురుగా టీ కొట్టులో టీ తాగి అప్పుడు ఆ ఇంటి వైపు అడుగులు వేశాడు.

ఇల్లంతా సందడిగా ఉంది.

సత్యనారాయణ తనకు వచ్చిన ఉత్తరాన్ని అక్కడి వారికి చూపించాడు. వారు రిజిస్టరులో పేరు రాసుకుని నంబరు ఇచ్చారు.

అది ఏడవ నంబరు.

ఒక్కొక్కరు లోపలికి వెళుతున్నారు. వారు వెళ్ళగానే తలుపులు మూసుకుంటున్నాయి. బైటికి వచ్చిన తర్వాత మరొకరికి అమ్మ నుంచి పిలుపు వస్తోంది.

సత్యనారాయణకు పిలుపు రావడానికి రెండు గంటల సమయం పట్టింది.

లోపల పూజగది.

పట్టుచీరలో అమ్మ నిండుగా కూర్చుని ఉంది. మెడనిండా బంగారు నగలు అలంకరించుకుంది. చిద్విలాసంగా నవ్వింది.

చందోలు వెంకట సత్యనారాయణ ఆమె ముందు సాష్టాంగ పడిపోయి నమస్కారం చేశాడు. తర్వాత తను తెచ్చిన పూజ సామగ్రి, అరటిపండ్లు, కొబ్బరి కాయ అందించాడు.

అమ్మ ఊదొత్తులు వెలిగించింది.

కొబ్బరికాయను మూడుసార్లు పూజా మండపం చుట్టూ తిప్పి కొట్టింది. రెండు ముక్కలైంది. ఆ ముక్కల్లోంచి వెండికాసు బయటపడింది. దానిని తీసుకుని సత్యనారాయణకు ఇస్తూ తావీదుగా కట్టుకోమని సైగతో చెప్పింది.

సత్యనారాయణలో చెప్పలేని ఆశ్చర్యం.

తర్వాత తన బాధలను ఏకరువు పెట్టారు. ఎంత సంపాదిస్తున్నా అనారోగ్యం, ఇంటిలో సమస్యలు, కుటుంబ కలహాలు వివరించాడు. మనశ్శాంతి కలిగించమని వేడుకున్నాడు.

కళ్ళు మూసుకోమని అమ్మ కళ్ళతోనే సైగ చేసింది.

సత్యనారాయణ కళ్ళు మూసుకున్నాడు.

గదిలో మంద్రస్థాయిలో వినిపిస్తున్న భక్తి పాటలతో పాటు అమ్మ మాటలు వినిపించాయి. "ఆరు నెలల్లో కష్టాలు తీరుతాయి. నీకున్న డబ్బు కూడా రెట్టింపు అవుతుంది. చెప్పినట్లు చెయ్యి!" అంది. ఆ మాటల ప్రభావం సత్యనారాయణను ఉన్మత్తుడిని చేసింది.

అమ్మ చెప్పినట్లు చేశాడు.

తెచ్చిన రు.10 వేల కట్ట పసుపు గుడ్డలో చుట్టాడు. అమ్మ ఆ మూటను మండపం చుట్టూ తిప్పి పక్కన పెట్టింది. తర్వాత పూజా సామాగ్రి కోసం మరో వెయ్యి రూపాయలు కావాలని అడిగితే పక్కనున్న హుండీలో వేశాడు.

"నీకు శుభం కలుగుతుంది. ఆరు నెలల వరకు ఈ మూట విప్పకు. విప్పితే కుటుంబానికి ప్రాణగండం... తర్వాత చూస్తే డబ్బు రెట్టింపు అవుతుంది.... ఏమీ కాకపోతే నీకు పట్టిన శని వదిలిపోయినట్లు గుర్తించి మళ్ళీ నన్ను సందర్శించుకో..." అమ్మ మాటలు దృఢంగా ఉన్నాయి.

మరోసారి నమస్కారం చేసి మూటను పట్టుకుని సత్యనారాయణ గది బైటికి వచ్చేశాడు.

ఏదో సాధించానన్న సంతృప్తి మనసునిండా కమ్ముకుంది. ఆనందంగా ముందుకు అడుగులు వేశాడు.

***

ఆరు నెలల తర్వాత అమ్మను మనసులోనే ప్రార్థించి చందోలు సత్యనారాయణ పసుపు గుడ్డతో కట్టిన మూట విప్పాడు. అందులో తెల్లకాగితాల కట్టలు తప్ప మరేమీ లేదు. అంటే తనకు పట్టిన శని ఇంకా వదిలిపోలేదన్నమాట.

ఏదో అనుమానం మనసులో నీడలా ప్రవేశించి పెద్దది అయిపోయింది.

అమ్మ మాటలు... మంద్రంగా వినిపించిన కేసెట్‌లో పాటలు మనసులో మెదిలాయి. ఆరు నెలల క్రితం అశోక్‌నగర్ అపార్టుమెంటులో తను కలుసుకుని పూజలు జరిపిన విధానాన్ని గుర్తు తెచ్చుకున్నాడు.

అప్పటికే అమ్మ కీర్తి ఆ చుట్టుపక్కల కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో వ్యాపించింది. అటువంటి అమ్మమీద అనుమానం సమంజసమూ అని మనసులో అనుకున్నాడు.

కానీ అతని మనసును అనుమానం జయించింది.

పట్టాభిపురం పోలీసు స్టేషన్‌కు వెళ్ళి అమ్మ సంగతి మొత్తం వివరించాడు.

2001 నవంబర్ 9న పోలీసులు రంగప్రవేశం చేశారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, పోలీసు సిబ్బంది సాంబశివరావు, శ్రీనివాసరావు, ప్రసాద్‌రాజు బృందంగా బయలుదేరి అమ్మ నివసిస్తున్న

అపార్టుమెంటుపై దాడి జరిపారు.

హస్తలాఘవంతో ఎంతోమందిని అమ్మ మోసగించినట్లు ధృవీకరించారు. ఇంటిలో వేలాది రూపాయల విలువైన గృహోపకరణాలు అనుమానాలను నివృత్తి చేశారు. రు.2.40 లక్షల నగదు, విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

అమ్మను అదుపులోకి తీసుకున్నారు.

***

కొల్లపాకల శంకరరావు గుంటూరు పట్నం బజారు ప్రాంతంలో దుకాణాల్లో పని చేసే చిన్న గుమాస్తా. పదేళ్ళ క్రితం కేవలం నెలకు రెండు మూడు వందల రూపాయల ఆదాయంతో జీవితాన్ని ప్రారంభించాడు.

నలభై సంవత్సరాల వయస్సు వచ్చినా ఏదీ కలిసి రాలేదు. ఆదాయం లేక అష్టకష్టాలు ఎదుర్కొన్నాడు.

ఆ సమయంలో ఎప్పుడో నేర్చుకున్న మేజిక్‌లు అక్కరకు వచ్చాయి. వస్తువుల్ని మాయం చేయడం, చిన్న లాకెట్లు, నాణేలు చేతిలో పట్టుకుని గాలిలోంచి సృష్టించినట్లు ఇవ్వడం బాగా రావడంతో అవే ఉపాధికి మార్గం చేసుకున్నాడు.

ఆ మంత్రాలకు భక్తి జోడించాడు.

విపరీతమైన ప్రచారం కల్పించాడు.

అమ్మను సృష్టించాడు. అమ్మ అనుగ్రహం కోసం వందలాది మంది పడిగాపులు పడేలా చేశాడు. అమ్మ అవతారం ద్వారా ఆదాయ మార్గాన్ని ఎంచుకున్నాడు.

అమాయకులకు, భక్తితో ముక్తి పొందాలనుకున్నవారికి గాలం వేసి ఉత్తరాల ద్వారా ఆకర్షించి ముడుపుల ద్వారా సొమ్ము కూడ బెట్టాడు.

అన్ని కార్యక్రమాలకూ అమ్మనే ఆధారం చేసుకున్నాడు. ఆదాయాన్ని పెంచుకున్నాడు.

పోలీసులు శంకరరావును అరెస్టు చేసి "ప్రజల్ని ఎందుకు మోసం చేశావు" అని ప్రశ్నిస్తే 'నమ్మిన వారినే నమ్మించగలం' అన్నాడు.

"ఎలా?"

"అవును... నేను ఆడవేషం వేశాను. అమ్మగా మారాను.. భక్తులందరూ నమ్మారు. అమ్మగా నిన్ను పూజించారు. ఆశీర్వాదం కోరారు.. అందరూ నన్ను నమ్మారు... నమ్మారు కాబట్టే మోసం చేశాను..." అమ్మకాని అమ్మ కొల్లిపాకల శంకరరావు చెప్పాడు.

శంకరరావులో పోలీసులకు అమ్మ లక్షణాలు కన్పించలేదు. అమ్మ పేరును అపహాస్యం చేసిన మోసకారి కన్పించాడు. ★

ఎదురుగాలి

(19వ పేజీ తరువాయి)

తీశారట. అలాగే మన దేశంలో లంచగొండి వెధవల్ని అందర్నీ పట్టుకుని వురితీస్తే తప్ప ఈ లంచాలు పోవు!"

"అలా వురి తీస్తే దేశంలో ఒక్క అధికారీ మిగలదు, ఒక్క మంత్రీ మిగలడు!" జనంలో నుంచి ఒకతను అన్నాడు.

"బర్త్ సర్టిఫికెట్స్ విషయంలో గవర్నమెంటు చాలా స్ట్రిక్ట్‌గా వుందట కదా!" రాజేష్ అన్నాడు.

"అవునవును. చాలా స్ట్రిక్ట్‌గా వుంది. ముష్టి రెండొందలు లంచం పారేస్తే ఆ స్ట్రిక్ట్ సడలిస్తుంది. నిన్న బస్టాండ్‌లో ఒక ప్యాసెంజర్ దగ్గర ఎవడో50 రూపాయలు జేబు కొడితే వాడ్ని పట్టుకుని యమ కొట్టుడు కొట్టారు. పాపం వాడు కూటికి గతిలేక, ఆకలికి వుండలేక చేశానని ఏడుస్తూ చెప్పాడు. అది నిజం కావచ్చూ, కాకపోవచ్చూ! అయినా వాడ్ని చావగొట్టారు. 50 రూపాయల దొంగతనానికే వాడిని అలా కొట్టారే, వీళ్ళు చేసేది దొంగతనం కాదా? దీనిని దొరతనం అంటారా? ఏడవ తరగతి చదివే పదీ పన్నెండేళ్ళ పిల్లవాడి బర్త్ సర్టిఫికెట్ కోసం లంచం అడిగారే! పిల్లల నోళ్ళు కొట్టే వీళ్ళని ఏం చెయ్యాలి?" జనాన్ని పెద్దగా ప్రశ్నించాడు కృష్ణ.

గదిలో కూర్చున్న ఎంఆర్‌ఓకి ఈ మాటలు అన్నీ వినపడుతున్నాయి. వీస్తున్న ఎదురుగాలిని అర్థం చేసుకుంది. ఈ ఎదురుగాలిని ఇంతటితో ఆపకపోతే ఇదే సుడిగాలై తమని చుట్టేస్తుందని గ్రహించింది.

బెల్‌నొక్కి బిళ్ళ జవాన్ను పిలిచి, కృష్ణను రమ్మని కబురు పంపించింది.

"నిన్ను ఎంఆర్‌ఓ రమ్మంటున్నారు" అని జవాను వచ్చి చెప్పాడు.

కృష్ణ ఎంఆర్‌ఓ రూంలోనికి వెళ్ళాడు.

"ఏంటయ్యా గొడవ?" ఎంఆర్‌ఓ ప్రశ్నించింది. "గొడవ కాదండీ, పిల్లవాడి డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ కావాలంటే..." కృష్ణ జవాబు చెబుతున్నాడు.

"ఏవీ ఆ ఫారాలు..." కృష్ణమాటలు పూర్తిగా వినకుండానే అడిగింది ఎంఆర్‌ఓ. అతను చేతిలో వున్న పుస్తకంలో నించి రెండు ఫారాలు తీసి ఇచ్చాడు.

"మా ఆర్‌ఐకి బుద్ధిలేదు. ఆయన ఎప్పుడూ అంతే. తలనొప్పులు తీసుకువస్తాడు" అంటూ సంతకం పెట్టింది.

తనే ఎంఆర్‌ఓ ముద్ర, మూడు సింహాలు, అశోకుని స్థూపం కలిగిన రాజముద్ర స్టాంపు రెండూ వేసింది. "మీరు బయట గొడవ చేయకుండా వెళ్ళండి. ఆర్‌ఐ విషయం నేను చూస్తాను"

కృష్ణ విజయగర్వంతో ఆ సర్టిఫికెట్లు పట్టుకుని బయటికి వచ్చాడు.

"నా పని అయింది. అవినీతికి వ్యతిరేకంగా ఒకరూ ఇద్దరూ మాట్లాడటం కాదు. పెద్ద ఉద్యమం జరగాలి. ప్రజల్లో కదలిక వచ్చి ఉద్యమం ఉధృత స్థాయిలో జరిగితే తప్ప అవినీతి అంత తేలికగా పోదు!" అంటూ మోటార్ సైకిల్ స్టార్ట్ చేసి, రాజేష్ వెనుక కూర్చోగా ముందుకు దూకించాడు కృష్ణ ★

పదాల అమరిక..



"రా..రా.. మళ్లీ ఏదో రాసి పట్టుకొచ్చినట్లున్నావ్.." సాదరంగా ఆహ్వానించాడు సుబ్రహ్మణ్యం.

"నీవల్ల నాకూ ఆసక్తి పెరిగిపోయింది మరి. అందుకే రాసేస్తున్నాను" కైలాసం బదులిచ్చాడు.

"ఇంతకీ ఏమిటది?"

"వార్తల్లో వాడే పదాల గురించి రాశాను"

"ఇంతకీ ఏమంటావ్.. ఆ వ్యాసంలో"

"నేను విడిగా అనడమెందుకు? రాసిందే ఇస్తాను చదువు." కైలాసం ఇచ్చాడు.

***

ఏ విషయాన్ని చెప్పడానికైనా సరైన పదాల అమరిక ఉండాలి. సమాచారాన్ని తెలియజేయడం వార్తాపత్రిక ప్రాథమిక ప్రయోజనం. పల్లెల్లో కొద్దిగా చదువుకున్న రైతులు, వ్యవసాయ కూలీలు, పట్టణాల్లోని కార్మికులు, ప్రొఫెసర్లు ఇలా అందరూ పత్రికా పాఠకులే. కాబట్టి పత్రికలోని భాష తక్కువ చదువుకున్న వారికీ అర్థం కావాలి. అదే సమయంలో ఉన్నతవిద్యాస్థాయి వారినీ ఆకట్టుకోవాలి. అర్థంకాని, కొరుకుడు పడని పాషాణంలా ఉండకూడదు. అపహాస్యానికి గురయ్యే దిగువస్థాయి ప్రయోగాలతోనూ రాయకూడదు. మరి ఏ భాష రాయాలి? అంటే ఏది అచ్చమైన వ్యావహారికమో దానినే రాయాలి.

భిన్న వార్తలు - విభిన్న పదాలు

మనం ఒక్కొక్క విషయాన్ని ఒక్కోలాగ స్వీకరిస్తాం. ఆ విషయం ఏ అంశానికి సంబంధించినది? అది ఏ స్థాయిలో ప్రతిబింబిస్తుంది? అన్న దానిని బట్టి మనం స్పందిస్తాం. ఉదాహరణకు అతిసారతో ఐదుగురు చనిపోవడం, అగ్నిప్రమాదంలో ఆరుగురు మృతిచెందడం ప్రాథమికంగా నష్టాన్ని, కష్టాన్ని, విషాదాన్ని కల్గించే వార్తలే. అయినప్పటికీ మొదటి వార్తకన్నా రెండోది ఎక్కువ దుఃఖాన్ని, స్పందనను కలిగిస్తుంది. అది మృతులసంఖ్యను బట్టి కాదు మరణం సంభవించిన తీరును బట్టి. అదే సందర్భంలో సజీవదహనం అయిన వారిలో పిల్లలుంటే ఆ వార్త మరింత స్పందన కల్గిస్తుంది. కడుపుచేత బట్టుకొని వలసలు వచ్చిన వారు దుర్మరణం పాలైతే దాని ప్రాధాన్యం మరింత పెరుగుతుంది. ఈ సంఘటనలన్నింటినీ మనం ఒకేవిధమైన పరిభాషతో రాయడం సరైన వార్తారచన అనిపించుకోదు. సంఘటన వార్తగా ఇవ్వడమనేది సమాచారం ఇవ్వడానికి సరిపోతుంది. దానికి ఉపయోగించే భాష వేరు. సంఘటనలో బాధితులైన వారి గురించి మానవీయ దృక్పథంలో వార్తా కథనం రాయాల్సి ఉంటుంది. దీనికి సంఘటన తీవ్రతను బట్టి పదప్రయోగం కూడా చేయాలి. అలాగే క్రీడా, సాంస్కృతిక అంశాలకు సంబంధించిన వార్తారచనలో ప్రత్యేకమైన భాషను, పదజాలాన్నీ వాడాలి. రెండుదేశాల మధ్య క్రికెట్ ఉత్కంఠభరితంగా సాగినప్పుడు, హోరాహోరీ పోరులో ఒక జట్టు విజేతగా నిలిచినప్పుడు ఆ కథనాన్ని అదేస్థాయిలో రాయాల్సిఉంటుంది. వార్త చదివినంత సేపూ పాఠకులు ఆటను చూస్తున్న అనుభవాన్ని భావావేశాన్ని పొందగలగాలి. ఇది ప్రస్తుతం ఉత్తమ వార్తారచనా పద్ధతిగా ఉంది. సాంస్కృతిక వార్తారచన కూడా ఈ విధంగానే చేయాల్సి ఉంటుంది. కార్యక్రమం జరిగేటప్పుడు ప్రేక్షకుడు ఏ రసాస్వాదన పొందుతాడో పాఠకుడు కూడా అదేవిధమైన స్పందనను పొందేలా పదప్రయోగం చేయాలి. ఇలా రకరకాల వార్తలకు రకరకాల పద ప్రయోగాలు చేయడం ప్రస్తుత ఉత్తమ వార్తారచనా పద్ధతి.

శోధనతోనే సాధన

సేకరించిన వార్తను సరైన పదాలతో పొదిగి పాఠకుడు చదివేలా ఇవ్వడం పత్రికా సిబ్బంది పని. దీనిలో విలేకరి, సబ్ఎడిటర్ ప్రత్యేకమైన కృషి చేయాల్సివుంటుంది. సరైన వార్తను ఎన్నుకోవడం, ఎన్నుకున్న దానిలో ప్రధానాంశాలను గుర్తించడం ఎంత ముఖ్యమైన పనో వాటిని ఆకట్టుకునే, అర్థమయ్యే భాషలో రాయడమూ అంతే ముఖ్యమైన పని. దీనికి ప్రధానంగా భాషపై అవగాహన, పదాలపై పరిజ్ఞానం అవసరం. ప్రయోగంలో ఉన్న పదాలను తెలుసుకోవడం, సరైన సందర్భంలో వాటిని ఉపయోగించడం అవసరం. పదాల స్వరూపం ఉత్పత్తి పట్ల చాలా మందికి అవగాహన లేకపోవడం ఇప్పుడు వేధిస్తున్న సమస్య. భాషపట్ల ప్రత్యేకమైన పరిశీలన లేకపోవడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. ఏ పదంలో ఏ అక్షరానికి ఒత్తు ఉంటుందో పరిశీలన లేకుండా అవగతంలోకి రాదు. పదేపదే ఈ విధంగా జరిగే పొరపాట్లు అప్రమత్తత లోపంతో వచ్చేవే తప్ప మరొక కారణం కావు. వార్తల్లో ఊత పదాలు, వ్యర్థపదాలు, అంచనా పదాలు, అపసవ్య పదాలు, అపహాస్య పదాలు, అపార్థపు పదాలను ఎప్పుడూ వాడకూడదు. ఇవేవీ విషయం తెలియజేయడానికి పనికొచ్చేవి కావు. పైగా విషయానికి అడ్డుపడతాయి. విషయాన్ని వక్రీకరిస్తాయి. వీటిని ఉపయోగించవద్దు. ఏ విషయానికి ఏ స్థాయిలో పదాలు అవసరమో అవే వాడటం వల్ల చెప్పాలనుకున్నది పాఠకుడికి సూటిగా చేరుతుంది. ★

పాఠక స్పందన

రియల్‌స్టోరీ బాగుంది

సెప్టెంబర్ 14వ తేదీ ఆదివారం అనుబంధంలో రియల్‌స్టోరీ శీర్షికన ప్రచురించిన చీకట్లో చందమామ మా హృదయాలు కదిలించి, మా మనసంతా కలత చెందేటట్లు చేసింది. బుడిబుడి నడకల వయసులో బోలెడు కష్టాలను అనుభవించడం నిజంగా మేము నమ్మరానినిజంగా పరిణమిస్తున్నది. చందమామలో మచ్చదాగి వున్నదని నిజంగా కథ ద్వారా తెలుస్తున్నది.

– మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణజిల్లా.

'జోగుపడుచు' బాగుంది

ఆగస్టు 31 ఆదివారం అనుబంధంలో శ్రీ చింతూరి మల్లిబాబుగారి 'జోగుపడుచు' కథ జోగినుల వ్యవస్థపై అనేక విషయాలను తెలియబరిచింది. రచయితకు ధన్యవాదాలు. వారం వారం మీరు ప్రచురిస్తున్న శీర్షికలు చాలా బాగుంటాయి. ముఖ్యంగా వారం వారం నేను ముందుగా చదివేది నా చేత చదివించేది పలుకుబడి.

– బద్దా నాగేశ్వరరావు, విజయవాడ

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

ఫోకస్